జనవరి-2024

# హన్నాకృప

ఆధ్యాత్మిక మాస పత్రిక

సంపాదకులు :

**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర**

B.A.,B.L.,

**చందా వివరాలు :**

**సంవత్సర చందా రూ. 350/-**

పోషక చందా రూ. 1500/-

జీవితచందా రూ. 5000/-

**చిరునామా :**

ఎడిటర్, హన్నాకృప

పోస్ట్‌బాక్స్ నెం. 51 , క్లౌపేట, 6వలైను

ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా

సెల్ : 9440217726

**బ్యాంకు అకౌంటు వివరాలు :**

A/c Name: **K. Emmanial Rajendra**

A/c No.: **10957294340**

Bank: SBI Main Branch, Ongole

IFSC Code : SBIN0000890

## విషయసూచిక


| | | |
|---|---|---|
| సంపాదకీయం | ఎడిటర్ | 02 |
| జఫ్పత్సనేహు | కొడవటికంటి | 03 |
| నా చిత్తానుసారుడు | కొడవటికంటి | 06 |
| వినండహో... | కె.ఇ. రాజేంద్ర | 08 |
| నూతన సృష్టి | కె.ఇ. రాజేంద్ర | 09 |
| మధ్యకాలము | హన్నాకృప డెస్క్ | 10 |
| నీ సృష్టికర్త | హన్నాకృప డెస్క్ | 11 |
| ఆశ్రయాస్పదము | సాక్ష్యము | 13 |
| క్రొత్తకోణాలు | అద్దంకిజాన్‌వెస్లీ | 16 |
| కృపాదానం | కొడవటికంటి | 17 |
| తామారు | స్త్రీల కొరకు | 19 |
| నిర్లక్ష్యము | చిన్నపిల్లల పేజి | 22 |
| బైబిల్ క్విజ్ - 01 | హన్నాకృప డెస్క్ | 24 |
| పరిశుద్ధగ్రంథపరిశోధనా పట్టిక-18 | | 24 |


**HANNA KRUPA**

Christian Devotional Monthly Magazine

సంపుటి : 21 సంచిక : 01

**ప్రభువగు యెహోవాయే నాకు బలము**

సీరియల్ నంబరు | |

# సంపాదకీయం....

హన్నాకృప పాఠకులకు ప్రభువు నామము క్రిస్మస్ శుభాకాంక్షలు!

క్రిస్మస్ పండుగ ముగిసింది. ఇంక అంతా క్రొత్త సంవత్సరానికి సిద్ధపడుతుంటారు. చాలామంది క్రిస్మస్ పండుగ కంటే నూతన సంవత్సరాన్ని బాగా సెలబ్రెట్ చేసుకుంటారు. ప్రపంచవ్యాప్తంగా కుల, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ జరుపుకొనే నూతన సంవత్సరం, క్రైస్తవులకు ఎలా పండుగ అవుతుంది? మన జీవితం మారకుండా పండుగ ఎలా చేసుకుంటాము. పుట్టినప్పటి నుండి క్రొత్త సంవత్సరం వస్తూనే వుంటుంది. మనం క్రొత్తగా తీసుకొనే నిర్ణయాలు పాతబడి పోతుంటాయి. ఈ క్రొత్త సంవత్సరమైనా నేను మారాలి అని చాలామంది అనుకుంటారు, నిర్ణయం తీసుకుంటారు కానీ, దానిని అమలు చేయలేరు. ఈ లోక ప్రభావం మనిషిని మీద చాలా ఎక్కువగా ఉంటుంది. అందుకే ప్రతి సంవత్సరం 'మారాలి' అనే నిర్ణయాన్ని అమలు చేయడం అసాధ్యమవుతుంది. మనిషి జీవితంలో మార్పు అనేది ఒక్కసారే జరగాలి తప్ప ప్రతి సంవత్సరం జరగకూడదు. ప్రతి సంవత్సరం జరిగే దానిని పండగ అంటారు తప్ప మార్పు అనరు. యేసుప్రభువు దగ్గరకు వచ్చిన నీకొదేముతో ఆయన 'ఒకడు నీటి మూలముగాను, ఆత్మ మూలముగాను జన్మించితేనేగాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడు' (యోహాను 3:5) అని చెప్పాడు. చాలామంది మారుమనస్సు పొంది బాప్తిస్మము తీసుకొని నీటి మూలముగా జన్మిస్తారు గాని, ఆత్మమూలముగా జన్మించరు. బాప్తిస్మం తీసుకున్న అనేకమంది ఈ లోకానుసారంగా జీవించడానికి కారణం వారు తీసుకున్న బాప్తిస్మము ఆచారమూలమైనదే తప్ప ఆత్మ మూలమైనది కాదు. నీటి మూలముగా జన్మించినవారు పరిశుద్ధాత్మ నడిపింపు ద్వారా జీవించినప్పుడే ఆత్మమూలముగా జన్మిస్తారు. నీటి మూలముగా జన్మించిన తరువాత తిరిగి ఈ లోకానుసారమైన జీవితం జీవిస్తే పరిశుద్ధాత్మ నడిపింపు వారికి ఉండదు కాబట్టి వారు ఆత్మ మూలముగా జన్మించలేరు. పుట్టిన ప్రతి ఒక్కరిని దేవుడు యథార్థంగానే పుట్టించాడు. అయితే మనుష్యులు ఈ లోకములో జీవించడానికి కల్పించుకున్న వివిధ తంత్రములు వలన ఆత్మ మూలముగా జన్మించలేక పోతున్నారు. నీటి మూలముగా జన్మించిన వారు ఆత్మమూలముగా జన్మించాలంటే ఆత్మానుసారమైన జీవితం జీవించాలి. లేదంటే మళ్ళీ అదే పాత జీవితం. నీటి మూలముగా జన్మించినవారు వాక్యం ద్వారా రూపాంతరం చెందకపోతే ఆత్మమూలముగా జన్మించలేరు. రూపాంతరం చెందటమంటే పాత జీవితం పూర్తిగా కనుమరుగవ్వటం. నీటిమూలముగా జన్మించే బాప్తిస్మం బాహ్య సంబంధమైనదై పదిమందికి తెలిసేదిగా ఉంటుంది. ఆత్మమూలముగా జన్మించేది హృదయ సంబంధమైనదై దేవునికి మాత్రమే తెలుస్తుంది. మనం మనుష్యుల ముందు మార్పు చెంది, దేవుని ముందు మార్పుచెందకపోతే అది నిష్ప్రయోజనం. నీవు దేవుని రాజ్యంలో ప్రవేశించాలంటే ఈ క్రొత్త సంవత్సరం నుండి నీ జీవితాన్ని పూర్తిగా మార్చుకొని బాప్తిస్మం పొంది, వాక్యం ద్వారా రూపాంతరం చెంది, ఆత్మమూలంగా జన్మించాలని నిర్ణయం తీసుకోడానికి నీవు సిద్ధమా?.

–ఎడిటర్, కొడవటికంటి ఇమ్మానియేల్ రాజేంద్ర

**K. Emmanial Rajendra, SBI Main Branch, Ongole**

**A/c No. 10957294340**

# జప్నత్పనేహు



**(యోసేపు జీవిత చరిత్ర)**

- కొడవటికంటి

ఒకరోజు ఉదయాన్నే రాజమందిరానికి వెళ్ళటానికి హడావిడిగా సిద్ధపడుతున్నాడు పోతీఫరు. ఫరో తరపున కొన్ని తూర్పు దేశపు ఓడలు కొనుగోలు చేయమని తనకు ఆజ్ఞ అయ్యింది. పదిరోజుల క్రితం తూరు పట్టణంలో దేవదారు మ్రానులతో తయారు చేయబడిన ఓడలు సముద్రంలో లంగరు వేయబడినవి. ఓడలను పరీక్షించ టానికి ఫరోతో కలసి పోతీఫరు సముద్రములోకి వెళ్ళి వచ్చారు. ఇప్పుడు కొనుగోలు చేసినవి కాక మరికొన్ని ఓడలను వ్యాపారం నిమిత్తం కొనుగోలు చేయాలని ఫరో వలన ఆజ్ఞ అయింది. కావున పోతీఫరు రేవు పట్టణంకు వెళుతున్నారు. ఇంతలో "యోసేపు తమ దర్శనం నిమిత్తం రావచ్చునా?" అని కబురు వచ్చింది. పోతీఫరుకు కొంచెం విసుకు అనిపించినా, ఎంతో అవసరం అయిన విషయం కాకపోతే యోసేపు ఆ విధంగా కబురు చెయ్యడని, ఆ కబురు తెచ్చిన బానిసను వెంటబెట్టుకొని, యోసేపు గది వైపుగా నడిచాడు.

యోసేపు ఆసనములో కూర్చోని ఏవో లెక్కలు వ్రాస్తున్నాడు. పోతీఫరు నేరుగా గదిలోనికి వెళ్ళి వేరొక ఆసనం లాక్కుని కూర్చున్నాడు. యోసేపు తలెత్తి చూసి బిత్తరపోయి లేచి నిలుచున్నాడు. అలా నిలబడటంతో కాగితాలు చెల్లాచెదరుగా పడిపోయాయి. పోతీఫరు నవ్వి, యోసేపును కూర్చోమన్నాడు. ఇప్పుడు పోతీఫరులో ఉన్న అలసట, తొందర పోయినవి. విశ్రాంతిగా ఆసనములో జారిగిలబడి, "ఏంటి, అంత అవసరంగా మాట్లాడాల్సిన విషయం?" అని అడిగాడు.

యోసేపు దూరంగా నిలబడివుంటే, పోతీఫరు ఆజ్ఞాపిస్తున్నట్లుగా "కూర్చో" అన్నాడు. యోసేపు కూర్చోక తప్పింది కాదు.

"అంత అవసరంగా చేయవలసింది కాదు ప్రభూ! కాని ఎప్పటికైనా సెలవు పొంది చెయ్యవలసిన పని. కనుక తమరు తీరుబడిగా ఉంటే మనవి చేస్తాను" అన్నాడు.

"అంత అవసరమైతే ఇప్పుడే చెప్పు" అన్నాడు. తను విశ్రాంతిగా ఉన్నట్లుగా ఇంకా కొంచెం కాళ్ళు ముందుకు చాపి వీపు మీద కూర్చున్నట్లు జారగిలబడ్డాడు.

"గత నాలుగు సంవత్సరాల్లో పండ్లతోటలు మంచి లాభాలు గడించాయి. వాటిమీద వచ్చిన ఆదాయం అంతా తమరి పేరు మీద షావుకారుల యొద్ద ఉంచాను. ఎల్లకాలం ఈ తోటల ఆదాయం ఒకే విధంగా ఉండదు. అదీకాక ఈ తోటల వయస్సు తరిగిపోయే కొలది ఆదాయం తగ్గి పోతుంది. అందువలన ఎప్పుడు స్థిర ఆదాయం ఉండేటట్లు ఏర్పాట్లు చేయాలని అనుకున్నాను" అన్నాడు యోసేపు.

పోతీఫరు అసహనంగా చూచాడు. "ఈ విషయాలలో నువ్వు నాతో సంప్రదించనవసరం లేదు కదా! నీకు సర్వ హక్కులున్నాయి. షావుకారుల వద్ద ఎంత డబ్బు ఉండేది, నాలుగు సంవత్సరాల నుండి నాకు అసలు తెలియదు. మీ అమ్మగారికి అసలే తెలియదు. కనుక మీరే ఆ విషయం చూడండి. తర్వాత ఈ సంవత్సరం నీకు వివాహం చెయ్యాలని మేము నిశ్చయించాము. కనుక మీకు కూడా స్థిరమైన ఆదాయం వచ్చే ఏర్పాటు చూడాలి. ఎందుకంటే నువ్వు ఈ సేవలలో నుండి విడుదల పొందితేనే కాని, నీకు వేరొక చోట ఉద్యోగం దొరకదు. అలా చెయ్యటం నీకు ఇష్టం లేకపోతే నా యొద్ద నుండి విడుదల పొంది నా దగ్గరే ఉద్యోగం చెయ్య వచ్చును" అన్నాడు.

యోసేపు అది ఏమి పట్టించుకోలేదు. విననట్లుగానే "ఫరో రాజుగారు తూరు దేశములో నిర్మించబడిన దేవదారు ఓడలు కొన్నారని విన్నాను. అదే విధంగా మీరుకూడా ఒక ఓడ మీ స్వంతానికి కొంటే..."

పోతీఫరు అదిరిపడ్డాడు. పైకి జరిగి ఆసనంలో సరిగా

కూర్చుని యోసేపు ముఖంలోకి సూటిగా చూస్తూ, "నువ్వేమి మాట్లాడుతున్నావో నీకు తెలుసు కదా? ఒక ఓడ ఖరీదు ఎంత? అది మహారాజులకు మాత్రమే చెల్లుతుంది. మన లాంటివాళ్ళు ఓడలు కొనాలంటే ఇద్దరు, ముగ్గురు కలిస్తే కాని ఓడ కొనగలిగినంత డబ్బు కూర్చలేరు" అన్నాడు.

"చిత్తం, ఓడ ఖరీదు పది తలాంతులు వరకు ఉంటుందని విన్నాను. కాని ఎన్నడూ ఓడ లోపల చూడ లేదు. ఆ లెక్కన అయితే మీరు సొంతగా ఒక ఓడ కొను క్కున్నా, షావుకారులవద్ద రావలసిన వడ్డీ బాపతు ఇంకా ఒక తలాంతు మీ పేరు మీద నిల్వ ఉంటుంది" అని చెప్పాడు యోసేపు.

అంతవరకు ఆశ్చర్యంగా చూస్తున్న పోతీఫరు కొంచెం తేరుకొని, "యోసేపూ.. ఇప్పుడు మన దగ్గర పదితలాంతుల డబ్బు నిల్వ ఉన్నదా?!" అడిగాడు పోతీఫరు. "చిత్తం, తమరి దగ్గర ఉన్న లెక్కల పుస్తకాలు మీరు ఎప్పుడూ చూచినట్లుగా లేదు. ప్రతి సంవత్సర ఆదాయం, సంవత్సరం చివరలో మీకు పంపుతున్నాను. అంతేకాదు షావుకారుల వద్ద వడ్డీకి ఇవ్వని సొమ్ము మన ఇంట్లో రెండు తలాంతుల వరకు ఉంది" అని చెప్పాడు యోసేపు.

పోతీఫరు 'ఇది కలా...?' అనుకుంటున్నాడు. యోసేపు తన ఇంట్లో అడుగుపెట్టి తనను ఒక రాజంత గొప్ప వాడిని చేసాడు. కాదు. యోసేపు యొక్క దేవుడు – యోసేపును బట్టి నన్ను ఆశీర్వదించాడు. "సరే! అక్షాపుకు ఈ లెక్కలు తెలుసా?" అని అడిగాడు.

"మూడు సంవత్సరాల క్రితం తమరు అక్షాపును రాజు కొలువులో చేర్పించిన తర్వాత, అతనికి ఈ లెక్కలు తెలియవు. అతనిని మీ దయార్ధ హృదయంతో గొప్పవాడిని చేసిన తర్వాత అతనికి ఈ లెక్కలు చూపించ పని లేదు. చివరికి అమ్మగారికి కూడా ఈ విషయాలు తెలియవు. అయినా, తులము బంగారం కాని, వెండికాని, మీ సెలవు లేనిదే నేనైనా ఉపయోగించటానికి వీలు లేకుండా నమోదు చేయబడింది" అని చెప్పాడు యోసేపు.

యోసేపు ముఖంలోకి చూస్తూ ఆలోచిస్తున్నాడు. అతని ముఖం క్రొత్తగా కనిపిస్తుంది. దేవదూత ఎవరో ప్రత్యక్షమై తను కోరకుండానే వరాలు ఇస్తున్నట్లు అనిపించింది. ఇదంతా తన ఆస్తి. కాని ఈనాటి వరకు తనకు మరుగు చేయబడింది. తనకు తెలియకూడదని కాదు కాని, ఇంత వరకు తెలియపరచనవసరం లేదు అని యోసేపు అను కున్నాడు కాబోలు. ఇప్పుడు ఓడను కొనటానికి అవసరం కాబట్టి తెలియపరచాడు. ఇదే విధంగా ఇంకా తనకు తెలియబడని సంగతులు తన ఇంట్లోనే ఎన్ని దాచబడినవి? ఛ... దాచబడటం కాదు తెలియ పరచబడలేదు.

యోసేపు వైపు ఇప్పుడు యజమానిలా చూచాడు పోతీఫరు. "నువ్వు ఇంకా ఏమైనా మాకు చెప్పవలసినవి ఉన్నవా?" అడిగాడు పోతీఫరు. "ప్రస్తుతం తమరు ఈ ఓడ కొనుగోలు విషయం సెలవియ్యలేదు" అని మాత్రం అన్నాడు యోసేపు.

"ఇప్పుడు ఫరో ఓడలు కొంటున్నాడు. ఇప్పుడే నేనూ ఓడను కొనటం మంచిది కాదు. నువ్వు ఓడల సంగతి ఒక సంవత్సరమైనా మర్చిపోవాలి. ఈ లోపల ఆ సొమ్ము ఖర్చు చెయ్యాలంటే వేరే ఏదయినా ఓఫిరు బంగారం కొను. కానీ, ఐగుప్తులో ధర ఎలా ఉందో! తెబిస్‌ను ఇప్పుడు ఫరో ఐగుప్తుకు రాజధానిగా రూపొందించాలనుకుంటున్నారు కదా! అక్కడ మన కొరకు ప్రాంగణాలు నిర్మించవచ్చు. ఏదైనా మీ యజమానురాలితో సంప్రదించండి" అని చెప్పి, "ఔను! నీ కొరకు ఒక నెల రోజుల నుండి చాలాసార్లు కబురు పంపినా లేవట?" అడిగాడు పోతీఫరు.

"ఆ సంగతి నాకు తెలియపరచబడలేదు. ఈ నెలంతా ఎక్కువ సమయం పొలం పనులు చూడటానికి గడిపాను. మీకు ఇష్టమైతే నేను ప్రస్తుతం ఉపయోగిస్తున్న రథం మార్చి వేరొకటి కొనాలనుకుంటున్నాను. ఇప్పుడున్నది చాలా పాతది అయిపోయింది. అది లాగటానికి గుర్రాలు చాలా బాధపడుతున్నాయి" అని అడిగాడు యోసేపు.

పోతీఫరు ముఖం కొంచెం విసుక్కున్నట్లుగా పెట్టాడు. "పదిహేను తలాంతులతో ఈ మెంఫిస్ పట్టణంలో ఉన్న రథాలన్నీ కొనగలమని మీకు తెలుసునా?" అని అన్నాడు

కొంచెం కోపంగా. యోసేపు తను కూర్చున్న చోట అసహనంగా కదిలాడు. పోతీఫరుకు కోపం వచ్చిన సంగతి తెలుస్తుంది.

"ఈ ఐగుప్తుదేశం అంతా నా కొరకు సంపాదించి పెట్టి, మీరు కుంటి రథంలో తిరుగుతుంటే నేను సంతోషిస్తానా? ఇలా చిన్న చిన్న వాటి కొరకు నా అనుమతి అడిగితే, నేను చేసే ఉద్యోగంలో నా మనసు ఇంటి మీద కేంద్రీకరించటం నాకు ఇష్టం ఉండదు. మీ యజమానురాలు మీ విషయం ఎప్పుడూ ఫిర్యాదు చేస్తూనే ఉంది. మీరు ఈ బాధ్యతలు నెరవేరుస్తూ ఆమె అవసరాలు మర్చిపోతే అది నాకు సంతోషమా? ఈ ఇంటిలో కాని, పొలంలో కాని నాకు ఏమి ఉన్నవో- నావి ఏవో, నావి కానివి ఏవో నాకు తెలియదు. ఆ విధంగా మీరు నా యెడల ప్రేమగా వ్యవహరించటం నాకు సంతోషమే. కాని నా భార్య కూడా నాలానే సంతోషంగా ఉండాలని కోరుకుంటాను కదా! కనుక అశ్రద్ధ చేయకుండా ఆమె అవసరాలు గమనించండి. ఇకముందు ఏ వ్యాపారం ప్రారంభించాలన్నా నా పేరు మీద చెయ్యొద్దు. ఇప్పుడున్న ధనమంతా మీ యజమానురాలి పేరు మీద మార్చండి. ఎందుకంటే నేను ఫరో సేవకుడను. అంత సొమ్ము నా స్వంతం అయి ఉండటం అనేక అనర్థాలకు కారణం అవుతుంది. ఇప్పటికే సమయం హెచ్చుగా గడిచింది" అంటూ లేచి నిలుచుంటుంటే యోసేపు కూడా లేచి నిలబడ్డాడు. యోసేపు ఇప్పుడు ఎత్తులోను, బలంలోను, అందంలోను పోతీఫరును మించి ఉన్నాడు. ఇప్పుడు ఇంత దగ్గరలో ఎదురెదురుగా ఇద్దరు నిలబడినప్పుడు పోతీఫరు గమనించాడు. యోసేపు భుజం మీద చెయ్యి వేసాడు ప్రేమగా...! యోసేపు ఉలిక్కిపడ్డాడు. ఇదే మొదటిసారి. పోతీఫరు తన మీద అలా ప్రేమగా చెయ్యివేయటం. 'ఒక హెబ్రీయుని ఒక ఐగుప్తీయుడు అంతగా గౌరవించటమా?' అనుకున్నాడు. "ఈ సంవత్సరం మీరు వివాహం చేసు కోవాలి" అని చెప్పాడు. యోసేపు పోతీఫరు ముఖంలోకి మొదటిసారిగా నిదానించి చూచాడు. పోతీఫరు కూడా తన చూపును అట్లాగే నిలిపాడు. చాలా మృదువుగా, బ్రతిమాలు తున్నట్లుగా, చాలాకాలంగా తన హృదయంలో దాచిన విన్నపం మొదటిసారిగా విన్నవిస్తున్నట్లుగా, "దేవుడు నాకు ఏమి చేసేది నేను తెలుసుకొనే వరకు నన్ను మీ యొద్ద ఇలాగనే ఉండనివ్వండి" అని తల వంచుకున్నాడు యోసేపు.

పోతీఫరుకు ఎందుకో హృదయంలో వేదన మొదలయ్యింది. యోసేపు ఈ విషయం గమనించకూడదనుకొని ముఖం ప్రక్కకు తిప్పుకున్నాడు. గబగబా అడుగులు వేసుకుంటూ బయటకు నడిచాడు. బయట తన కొరకు నిలబడియున్న రథసారథి గబగబా నడిచి గుర్రాల ముందు నిల్చున్నాడు. పోతీఫరు రథంలో కూర్చున్నాడు. యోసేపు బయట నిల్చుని రథం వైపు చూస్తూ ఉండటం పోతీఫరు గమనించాడు. **(సశేషం)**

**ఫోన్‌పే ద్వారా లేదా గూగుల్ పే ద్వారా**
**చందా పంపించాలంటే**
**ఈ క్రింది క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి**

Scan & Pay Using PhonePe App

Emmanial Rajendra

సీరియల్

15

# నా చిత్తానుసారుడు

(దావీదు జీవిత చరిత్ర)

– కొడవటికంటి

అబీషై దావీదును చూసి లేచి నిలుచున్నాడు. శబ్దం చెయ్యకుండా రమ్మని దావీదు సైగ చేసాడు. అబీషై ఆశ్చర్యపోతూ వచ్చాడు. వారిద్దరూ ఒక గుబురువద్దకు వెళ్ళి కూర్చున్నారు. దావీదు జరిగిన సంగతులన్ని చెప్పాడు.

అంతా విని "ఆ బెన్యామీనీయుడ్ని నువ్వెందుకు వదిలావు? సైన్యమంతా నీకు పరిచయమేకదా! ఇశ్రాయేలులో అందరికి నీవంటే ప్రేమ కదా! ఈ సంగతులు అన్ని గోత్రముల వారికి తెలియజేసి ఆ సౌలును పదవీచ్యుతుని చేస్తాను" అన్నాడు కోపంగా అబీషై.

''అది మనం చేయకూడదు. ఇశ్రాయేలులో అంతఃకలహాలు ఫిలిష్తీయులకు, యెబూసీయులకు బలం చేకూరుస్తాయి. అదికాక సౌలు నా భార్య తండ్రి, నా ప్రియ మిత్రుడు యోనాతానుకు తండ్రి. అన్నిటి కంటే ముఖ్యముగా అతడు యెహోవాచే అభిషేకించబడిన వాడు" అన్నాడు దావీదు.

"నీవు కూడా యెహోవాచే అభిషేకించబడిన వాడివే కదా!" అన్నాడు అబీషై. "నిజమే నన్ను పట్టుకోవాలని నాయోతు వచ్చి దేవుని ఆత్మ వలన ఒక రేయింబవళ్ళు పైబట్ట లేకుండా పడియున్నప్పుడు ఆయనకు హాని తలపెట్టటం దేవుని చిత్తము కాదు కదా!" అన్నాడు దావీదు.

"అయితే ఇప్పుడు ఏమి చెయ్యాలి? ఈ దేశంలో ఎక్కడున్నా నీకు క్షేమం కలుగదు. దేవుని వలన అభిషేకించ బడియుండటం నీ చేతిలో అతని మరణం తప్పించింది. అయితే దేవుని వలన నీవు అభిషేకించబడియుండటం అతని చేతిలో నీకు మరణాపాయమునకు కారణమయింది" అన్నాడు అబీషై.

"నేను గాతు వెళ్దామని అనుకుంటున్నాను" అన్నాడు దావీదు చిన్నగా. "ఆ..." అని అదిరిపోయి "అదెట్లా ఆకీషు సౌలుకి బద్ధ శత్రువైనంత మాత్రాన సౌలు శత్రువైన నిన్ను చేరదీస్తాడా పైగా నువ్వు సౌలు అల్లునివి" అన్నాడు అబీషై.

"ఆకీషు రాజు సౌలు శత్రువేకాదు, శౌర్యవంతులను ఆదరిస్తాడు. గొల్యాతు ఆ వూరి వాడైనా అతడు ఆకీషు సైన్యంలోని వాడు కాదు. కూలికి వచ్చిన వాడే. గొల్యాతు బలం చూసి అతనిని ఎలా యుద్ధమునకు తీసుకొని వచ్చాడో గొల్యాతును చంపిన వాడిని ఎందుకు కొలువులో తీసుకోడు?" అన్నాడు దావీదు.

"నీవెన్ని చెప్పినా గాతు వెళ్ళడం సింహం నోట్లో తల పెట్టినట్లే అంటాను" అన్నాడు అబీషై.

"ఈ ఖడ్గం నీ దగ్గర ఉంచు రేపు ఉదయం నేను గాతు వెళ్తాను అక్కడ అన్ని సవ్యంగా జరిగితే నీకు కబురు చేస్తాను. నువ్వు అక్కడికి రా! నేను అనుకున్నట్లుగా జరగకపోతే ఎలాగైనా నేను నిన్ను రేపు సాయంకాలం లోపల ఇక్కడే కలుసుకుంటాను" అన్నాడు దావీదు. అబీషై విచారంగా దావీదు వైపు చూచాడు.

దావీదు లేచి నిలబడి ఎడమ ప్రక్కన ఉన్న కొండవైపు నడిచాడు. అస్తమయం కావస్తుంది. అబీషై మందల వైపు వెళ్ళి రొట్టెలు, మంచినీళ్ళు తీసుకొని మంద కాపరులతో చెప్పవలసినవన్నీ చెప్పి దావీదు వైపు నడిచాడు. కొంచెం ఎత్తులో వున్న గుహలో దావీదు కూర్చోని విశ్రాంతి తీసుకుంటున్నాడు. అబీషై అతని కుడి ప్రక్కగా కూలబడ్డాడు.

గాతు పట్టణం ఫిలిష్తీయుల అయిదు పట్టణాలలో ఇశ్రాయేలుకు దగ్గరగా ఉంది. ఆకీషును గురించి తాను ఎంతో విన్నాడు. ఇప్పుడు ఆ రాజు దగ్గరకు వెళ్తున్నాడు. కొంచెంసేపు తాననుకున్నట్లుగానే జరుగుతుందని నమ్మకం. మరి కొంచెంసేపు అనుమానం.

అబీషై తన మేనల్లుడు. సెరూయా అక్క పెద్ద కుమారుడు, మహాపరాక్రమం గలవాడు. తనంటే చిన్నతనం నుండి వల్లమాలిన ప్రేమ. ఆయన అక్కలిద్దరూ అందరి కంటే పెద్దవారైనందున అతనిని ఎంతో ప్రేమగా పెంచారు. అమ్మ కూడా అక్కలిద్దరిని ఎంతో ప్రేమగా పెంచిందంట.

మీకాలు గుర్తుకు వచ్చింది. మనసంతా వికలమైంది. సమూయేలు చెప్పినట్లు తనదైనదేది కూడా శాశ్వితంగా తనకు దూరమవదు అని. అయితే అప్పటి వరకు ఈ హృదయకోత ఎలా భరించాలి. యోనాతాను అసహాయ శూరుడు. ఆయన దేవుని యందు విశ్వాసంతో ఎన్నో యుద్ధాలు చేశాడు. అయినా తన స్నేహం వలన ఎన్నో బాధలు పడ్డాడు. ఏదో ఒకరోజు యోనాతానే తనను చూడటానికి వస్తాడని ఆశ ఉన్నది.

గాతు పట్టణ ప్రాకారం సమీపించినప్పుడు తన తల మీద ఉన్న పాగా తీసి చేతితో పట్టుకున్నాడు. గవినిలో ప్రవేశించగానే అక్కడ ఉన్న వయసైన ఒక భటుడు ఆపాడు.

“పేరేమిటి?” అన్నాడు.

“దావీదు” అన్నాడు ముక్తసరిగా.

ఒక్కక్షణం అదిరిపోయి దావీదువైపు చూచాడు. ఆ పేరు వినగానే అక్కడ కూర్చుని ఉన్న భటులు కొందరు లేచి నిలుచున్నారు.

“ఇక్కడ గాతులో ఏమి పని?” అన్నాడు.

“మహారాజు ఆకీషును చూడటానికి” అన్నాడు.

“ఏ విషయం?” అన్నాడు.

“అది వారితోనే మాట్లాడాలి” అన్నాడు.

“అయితే నాతో రా!” అని బయలుదేరాడు. దావీదు అతనిని అనుసరించాడు. కొంత దూరం వెళ్ళిన తర్వాత వెనక్కి తిరిగి చూస్తే నలుగురు భటులు తనను వెంబడిస్తున్నట్లుగా తెలిసింది. గుండె వేగంగా కొట్టుకోవడం ప్రారంభించింది. ఆ భటుల ముఖం చూస్తే తనంటే వారికెంత కోపమో అర్థమవుతుంది.

కొంత దూరం నడిచిన తర్వాత రాజప్రసాదము కనిపించింది. బ్రహ్మాండమైన భవనం అయినా చాలా పురాతనమైనది. అక్కడ ముఖద్వారం వద్ద భటులతో ఏదో చిన్నగా మాట్లాడి రమ్మని దావీదుకు సైగచేసి కదిలాడు.

‘‘ఈ దావీదు ఆ దేశపు రాజు కాడా? వారు నాట్యమాడుచూ గాన ప్రతిగానములు చేయుచూ సౌలు వేలకొలది హతము చేసెననియు. దావీదు పదివేలకొలది హతము చేసెననియు పాడిన పాటలు ఇతని గురించి పాడినవే కదా!” అని ప్రవేశ ద్వారం దగ్గర ఉన్న ఉన్నతకాయులైన భటులు మాట్లాడుకోవడం విన్నాడు.

శరీరమంతా గగుర్పాటు కలిగింది. సింహం నోట్లో తల పెట్టవద్దన్నాడు అబీషై. కాని తాను సింహాల బోనులోకి వచ్చాడు. ఇశ్రాయేలు దేశమునుండి రావడం తాను చేసిన తప్పు. తను దేవుని మీద ధ్యాస తప్పినప్పుడే తన దారి తప్పింది. ప్రాణం ఇచ్చిన దేవునివైపు చూడకుండా ఆ ప్రాణాన్ని కాపాడుకోడానికి తన సొంత ఆలోచనలను అనుసరించాడు.

తనను ఒక గదిలో ఉంచి తలుపు బయట గడియవేసి ప్రక్క విశ్రాంతి గదిలో ఉన్న అకీషు దగ్గరకి వెళ్ళారు. తాను ప్రవేశద్వారం వద్ద తనను గురించి సైనికులు మాట్లాడిన మాటలే ఆకీషు సేవకులు రాజుతో చెప్తున్నారు. తన శరీరం తనకు తెలియకుండానే వణుకుతున్నది. చేతులు వాటంతటవే వంకరలు తిరిగినట్లుగా అనిపించింది. ఇంతలో బయట గడియ తీసిన శబ్దం తన నోట్లో ఏదో నురగ బయటకి వచ్చినట్లుంది. చేత్తో తడిమినప్పుడు తన ఉమ్మి గడ్డం మీద కారుతుంది. ఇద్దరు భటులు వచ్చి దావీదును భుజాలమీద పట్టుకొని రాజు ఎదురుగా నిలబెట్టారు. తనకు తెలియకుండానే తన కర్తవ్యం అర్థమైంది. నిలబడలేనట్టుగా కూలబడ్డాడు. సైనికులు వచ్చి లేపి నిలబెట్టారు. పడిపోతున్నట్టు గోడను పట్టుకొని వంకర తిరిగిన చేతులతో గోడలమీద గీతలు గీతలు గీసి, తలుపుల మీద గీస్తు కనుగుడ్లు తిరిగి పోతున్నట్లుగా తిప్పుతూ ఉమ్మి గడ్డం మీద కార్చుకుంటూ మీకాలు, మీకాలు షిమీనీ షిమీనీ అంటూ ఏడ్వటం మొదలు పెట్టాడు. హృదయ విదారంగా ఏడుస్తూ వుంటే అందరికి పాపం అనిపించింది.

అంతలో పెద్దగా నవ్వు, ఎక్కిళ్ళు వచ్చేటంత నవ్వు నవ్వుతూ గడ్డం తడిచేలా ఉమ్మి కారుస్తున్నాడు. అకీషు అలానే చూస్తూ ఉండిపోయాడు. తన భటుల వైపు కోపంగా చూశాడు.

**(సశేషం)**



# 'వినండహో...'



'యావత్ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియ జేయునది ఏమనగా' అని వీధిలో దండోరా శబ్దం వినగానే ప్రతి ఒక్కరూ చెవులు రిక్కించి వింటారు విషయం ఏంటా? అని. గతంలో ప్రసార సాధనాలు లేనప్పుడు ముఖ్యమైన విషయాలను దండోరా వేసి వినిపించేవాళ్ళు. ఇప్పుడంటే మనకి ఎవరూ చెప్పకపోయినా యూట్యూబ్, వాట్సాప్, ఫేస్‌బుక్ ద్వారా క్షణాల్లో తెలిసిపోతుంది. గతంలో అయితే ఏదైనా వార్త తెలియాలంటే ఎప్పటికోగానీ తెలియదు. అందుకే అత్యవసరమైనప్పుడు ప్రజలందరికీ తెలియాల్సిన విషయాన్ని గ్రామంలోనో, పట్టణంలోనో ఒక వ్యక్తి తప్పెట వాయిస్తూ ప్రతీవీధి తిరుగుతూ విషయాన్ని తెలియజేస్తారు. కొంతకాలం క్రితం వరకు ఆటోలో మైకు పెట్టుకొని వీధిల్లో తిరుగుతూ విషయం తెలియజేయటం అందరికీ తెలిసే ఉంటుంది. అబ్బబ్బా... ఏంటీ.. ఈ సోదంతా... అని విసుక్కో మాకండి. సాంతం వినే ఓపిక లేకపోతే ఒక్కో సారి మనకే నష్టం జరుగుతుంది. దేవుడు తన బిడ్డలని రక్షించుకోడానికి ఇలానేప్రవక్తలని,దైవజనులను పంపించి దండోరా వేయించి మరీ హెచ్చరించేవాడు. విన్న వాళ్ళు తమ ప్రాణాలు కాపాడు కున్నారు, విననివాళ్ళు నాశనమై పోయారు. ఈ రోజుల్లో మనుష్యులకి వినే ఓపికకానీ, అంత టైం కానీ ఉండటం లేదు. అయినా కూడా దేవుడు ఎంతో ఓపికతో పెందలకడనే లేచి ఎవ్వరూ నాశనం కాకూడదని చాలా కష్టపడుతున్నాడు. 'మీ చేతిపనుల వలన నాకు కోపము పుట్టించకుండునట్లును, నేను మీకు ఏ బాధయు కలుగజేయకుండునట్లును, యెహోవా పెందలకడ లేచి ప్రవక్తలైన తన సేవ కులనందరిని మీ యొద్దకు పంపుచు వచ్చినను మీరు వినక పోతిరి, వినుటకు మీరు చెవియొగ్గకుంటిరి' (యిర్మీ. 25:4-6). దేవుడు ఎంత పెందలకడ లేస్తే మాత్రం ఏం ప్రయోజనం మనం లేవాలి కదా! మన సెల్‌ఫోన్‌కీ నిద్రరాదు, మనకీ నిద్రరాదు, మనం ఎప్పటికి పడుకోవాలి, ఎప్పటికి లేవాలి? అయినా కూడా దేవుడు తన ప్రయత్నం మానడంలేదు. 'వినండహో' అంటూ యూట్యూబ్, వాట్సాప్, ఫేస్‌బుక్ ద్వారా మనకి మెసేజెస్ పంపిస్తూనే ఉన్నాడు. మైకులో, టి.వి.లో వాక్యం వినబడుతూనే ఉంది. తాగినవాడు మత్తులో జోగుతూ ఒళ్ళుపాయ తెలియకుండా ఎలా ఉంటాడో, మనం కూడా ఈ లోకపాప మనే మత్తులోజోగుతూ దేవుడు పంపే హెచ్చరికలను పట్టించుకోవడం లేదు. సొదొమ గొమొఱ్ఱా పట్టణస్తుల్లాగా దేవుని మాట పెడచెవినిపెట్టి నాశనమై పోకుండా నీనెవె పట్టణస్తు ల్లాగా దేవుని మాట విని మారు మనస్సు పొందితే రక్షింపబడతాము. 1,20,000 మంది ఉన్న నీనెవె పట్టణంలో యోనా ఒకరోజు ప్రయాణమంత దూరం తిరిగి 'ఇంక 40 రోజులకి ఈ పట్టణం నాశనమవు తుంది' అని ప్రకటించాడు. అప్పుడునీనెవెపట్టణస్తులందరూ మారు మనస్సు పొంది రక్షింపబడ్డారు. మారుమనస్సు పొందటానికి 40 రోజుల సమయం అవసరం లేకపోయిన ప్ప టికీ ఇప్పుడు న్నట్లు క్షణాల్లో వార్తలు తెలిసే టి.వి., ఇంటర్నెట్ అప్పుడు లేవు. కాబట్టి ఆ పట్టణంలో ప్రతిఒక్కరూ రక్షింపబడాలని దేవుడు వారికి 40 రోజులు సమయ మిచ్చాడు. ఇప్పుడు మనకి కూడా 'మారండి, మారండి' అని ప్రతిక్షణం హెచ్చరికలు పంపబడుతూనే ఉన్నాయి. మారడానికి మనకి ఇంకెంత టైం ఇవ్వాలి? 'వినండహో' అని ప్రతిరోజూ మైకు పెట్టి వినిపించే మాటలు వినబడ నంతగా దేవునికి దూరంగా ఉంటే సొదొమ గొమొఱ్ఱా పట్టణ ప్రజలకు పట్టిన గతే మనకి కూడా పడుతుంది.

ఫోన్‌పే లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపవలసిన ఫోన్ నంబరు
**9 4 4 0 2 1 7 7 2 6**

# నూతన సృష్టి

సూర్యుని క్రింద నూతనమైనదేదియు లేదు అని రాజైన సొలొమోను ప్రసంగి గ్రంథంలో చెప్పాడు. జనవరి 1 నూతన సంవత్సరమని ఎందుకు అనుకోవాలి? ప్రతి సంవత్సరం వచ్చే జనవరినెల మొదటిదినము క్రొత్తది ఎలా అవుతుంది? పండగ చేసుకోడానికి, తిని, త్రాగి తందనాలాడటానికి ఇది మనుష్యులు వారికోసం ఏర్పాటు చేసు కున్నది కదా! ఇంగ్లీషు సంవత్సరాది అని, తెలుగు సంవత్సరాది అని, తమిళ సంవత్సరాది అని సంవత్సర ప్రారంభాలు ఒక్కో జాతి మధ్య ఒక్కో విధంగా ఉన్నాయి. భూమి సూర్యుడి చుట్టూ తిరగటం ప్రారంభించిన దగ్గర్నుండి (స్థలము నుండి) మరలా అక్కడికి చేరుకున్నప్పుడే 365 రోజులు ముగుస్తాయి. అది దేవుడికి మాత్రమే తెలుసు. ఒక గ్రహం ఇంకొక గ్రహం చుట్టూ తిరగటం ముగియగానే మనం పండుగ చేసుకొనే పనైతే ప్రతి నెలా మనం పండగ చేసుకోవాలి. ఎందుకంటే చంద్రుడు భూమి చుట్టూ తిరగటానికి ఒకనెల పడుతుంది కదా! ఇంకా చెప్పాలంటే భూమి తన చుట్టూ తాను తిరుగుతుంది కాబట్టి ప్రతిరోజూ నూతనమైనదే కదా! కాబట్టి మనిషి తన సౌలభ్యం కోసం, తన సంతోషం కోసం సృష్టించుకున్న వాటితో దేవునికి ఏమి సంబంధం ఉండదు. క్రొత్త అనేది చాలా క్రేజీగా ఉంటుంది. క్రొత్తవాటి మీద చాలా మోజు ఉంటుంది. క్రొత్తవి సంపాదించుకున్నప్పుడు చాలా సంతోషంగా ఉంటుంది. అయితే క్రొత్త అనేది తాత్కాలికమైనది. రోజులు గడిచేకొద్దీ పాతవై పోతుంటాయి. పాతవాటి స్థానంలో క్రొత్తవాటిని మారుస్తారు లేదా శుభ్రపరచి క్రొత్తగా కనబడేలా చేస్తారు. ఈ లోక సంబంధంగా ప్రతిదాంట్లో క్రొత్తదనాన్ని కోరుకునే మనుష్యులు, ఆత్మీయంగా మాత్రం క్రొత్తదనాన్ని కోరుకోవడం లేదు. అదే పాత, పాప జీవితం లోనే జీవిస్తున్నారు. నూతన సంవత్సరం ఏదో క్రొత్తగా కనబడాలనుకున్నా మరుసటి రోజు నుండే పాత జీవితం లోకి వెళ్ళిపోతారు. గొంగళిపురుగు సీతాకోకచిలుకగా రూపాంతరం చెందిన తర్వాత మరలా ఒక్కసారైనా గొంగళి పురుగుగా మారుతుందా? మనుష్యులు మాత్రం సంవత్సరంలో ఒక్కరోజు మాత్రమే నూతనంగా మారి మరలా పాత జీవితంలోకి వెళ్తారు. పాత జీవితాన్ని వదలిపెట్టకపోతే నూతన జీవితం ఆచరణలోకి ఎలా వస్తుంది? *'మీరు జరిగించిన అక్రమ క్రియలన్నిటిని విడిచి నూతన హృదయమును నూతనబుద్ధియు తెచ్చుకొనుడి' (యెహెజ్కేలు 18:31)* అని బైబిల్లో వ్రాయబడిన ప్రకారం మనమెప్పుడైతే మార్పు చెందుతామో అప్పుడే మనకు నూతన సంవత్సరం. ఈ లోకానుసారంగా జీవించినంత కాలం మనం ఎప్పటికీ నూతనపరచబడము. *'మీరు ఈ లోకమర్యాదను అనుసరింపక, ఉత్తమమును, అనుకూలమును, సంపూర్ణమునైయున్న దేవుని చిత్తమేదో పరీక్షించి తెలిసికొనునట్లు మీ మనస్సు మారి నూతనమగుటవలన రూపాంతరము పొందుడి' (రోమా 12:2)*, దేవుని దృష్టిలో ప్రతిరోజూ నూతనమైనదే. ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు మాత్రమే నూతన సృష్టి. నూతనమనేది అలాంటి వారికే వర్తిస్తుంది. కాబట్టి లోకానుసారమైన జీవితాన్ని విడిచిపెట్టి నూతన జీవితం జీవించడానికి నేడే నిర్ణయం తీసుకో. 'ఇప్పుడే మిక్కిలి అనుకూలమైన సమయం. ఇదే రక్షణ దినము' ఈ నూతన సంవత్సరమున దేవుడు మిమ్మును, మీ కుటుంబమును ఆశీర్వదించును గాక!


## ఇంటర్నెట్‌లో తెలుగు బైబిల్

**మీరు ఎక్కడున్నా సరే, మీ స్మార్ట్ ఫోన్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్‌లలో తెలుగు బైబిల్ చూడవచ్చును. అంతేకాక తెలుగు-ఇంగ్లీషు ప్యారలల్ బైబిల్, తెలుగు ఆడియో బైబిల్, తెలుగు బైబిల్ ఎన్‌సైక్లోపీడియా, తెలుగు ఆడియో, వీడియో పాటలు, తెలుగు పాటల రచనలు, అద్భుత సాక్ష్యములు, బైబిల్ వాల్‌పేపర్స్, తెలుగు క్రైస్తవ పుస్తకములు ఇంకా మరెన్నో మీ కోసం... నేడే దర్శించండి...**

**www.onlinetelugubible.net**

# మధ్యకాలము

జుద్దువా అలెగ్జాండరును పట్టణములోనికి ఆహ్వానించి బలులు అర్పించి దానియేలు గ్రంథములోనున్న ప్రవచనాలను పర్షియా సామ్రాజ్యము గ్రీకు రాజు చేత కూల్చివేయబడుటను గూర్చి అతనికి చూపించెను.

యెరూషలేములో తనకు ఇవ్వబడిన ఘన స్వాగతమునకై అలెగ్జాండరు ఎంతో సంతోషించి ఆయన తిరిగి వెళ్ళేటప్పుడు యూదా మతమును, సిద్ధాంతాలను అంగీకరించెను. మరియు ఏడు సంవత్సరాలకు ఒకసారి కట్టవలసిన పన్నును కూడా తొలగించెను. యూదులు సంతోషించి అనేకులు అతనిని ఆమోదించిరి.

అతను యెరూషలేము విడచి వెళ్ళేటప్పుడు ఒక సమరయుడు గొప్ప ఆడంబరంతో, అట్టహాసంతో ఆయనను ఎదుర్కొని వారి పట్టణానికి ఆహ్వానించెను. కాని అలెగ్జాండరు వారి ఆహ్వానమును, కొన్ని ముఖ్య అవసరములకై వారు పెట్టుకున్న ఆర్జీలను కూడా తాను ఐగుప్తు నుండి మరల తిరిగి వచ్చు వరకు నిరాకరించెను. మరియు అతని అభిమాని సిరియా, పాలస్తీనా దేశాల గవర్నరు అయిన ఆంద్రోమాఖస్‌ని కూడా వదలి వెళ్ళెను.

ఆంద్రోమాఖస్ కొద్దికాలము తర్వాత వాణిజ్యపరమైన విషయంలో సమరియకు వచ్చెను. అలెగ్జాండరు జరిగించిన హింసాత్మక కృత్యములకు ప్రతీకారంగా సమరయులు ఆంద్రోమాఖసను కాల్చివేసిరి. అలెగ్జాండరు ఆ విషయం వినినప్పుడు ఆ హత్య జరిగించుటలో పాల్పడిన వారికందరికి మరణ శిక్ష విధించెను మరియు మిగిలిన వారినందరిని సమరయ నుండి బహిష్కరించాడు. అక్కడ మాసిదోనీయులకు ఒక కాలనీ ఏర్పాటు చేసి మిగిలిన స్థలమును యూదులకు ఇచ్చెను.

పర్షియా దేశము నశించిన తర్వాత గ్రీసు దేశమునకు అలెగ్జాండరు ఏకఛత్రాధిపతి అయ్యాడు. ప్రపంచంలోని ఎక్కువ భాగమును జయించుచూ బబులోనునకు వచ్చిన తర్వాత గొప్ప త్రాగుబోతుగా, తిండిబోతుగా మారి క్రీ॥పూ॥ 323 మరణించాడు.

అలెగ్జాండరు ఒక ధైర్యశాలి, ఉత్తమమైన ఆత్మ కలిగిన వాడని అనుకోకుండా ఉండలేము. కాని, విమర్శనాత్మక శక్తి కంటే తర్వగా మండిపడు స్వభావం కలిగి యుండేవాడు. అతని పనులు విజయవంతమైనా, అవి కోపంతోను, రౌద్రంతోను చేసినవే. అతనిలోనున్న కొన్ని మంచి లక్షణాలను ఎక్కువగా ఉన్న చెడు గుణాలు కొట్టివేశాయి. వృధాతిశయం అతని ముఖ్య కోరిక. పూర్వంపు గ్రీకు దేశపు యుద్ధశూరుల చరిత్రలకు తగిన విధంగా అతని జీవితాన్ని దిద్దుకున్నాడు. అతడు గాజా చుట్టూ తిరుగుట, భారతదేశం మీద దండయాత్ర చేయుట, సారేమేనియా మీదుగా త్రాగుచూ పయనించుట, జూపిటర్ కుమారునిగా పిలిపించుకొనుట ఇవన్ని అతని యొక్క అనవసరపు అతిశయాన్ని ధృడపరచుచున్నాయి. అతని చర్యలన్నీ పరిశీలించి చూస్తే రక్తం చిందించి ఏకాధిపత్యం కోరుకున్న వారివలే ఇతను కూడా ఆ కాలపు హంతకుడు అని పరిగణించ వచ్చును. ప్రపంచ శాంతి కొరకు, మానవ పరిరక్షణ కొరకు సరియైన న్యాయ సమ్మతమైన పోరాటము జరిగించి ఉంటే ఆ క్రియలన్నీ శ్లాఘించవలసినవే. కాని మిగిలిన విషయాలలో విజయం కేవలం హత్యా, దొంగతనం కంటే తక్కువేమి కాదు.

అలెగ్జాండరు మృతి చెందిన వెంటనే టోలమీసాటన్ ఐగుప్తును ముట్టడించెను. సమరయులు కాల్చిచంపిన ఆంద్రోమాఖస్‌కు బదులు లెమిడోన్ను అలెగ్జాండరు ఐగుప్తు గవర్నరుగా నియమించెను. ఈ లెమిడోన్ గవర్నరు నుండి సిరియా, పార్నిషియా, యూదయ దేశాలను పొందుటకు టొలమి సాటన్ వ్యర్థంగా ప్రయత్నించి వారిని సముద్రమార్గం, భూభాగద్వారా వెంటాడి లెమిడోన్‌ను చెరగొనిపోయి యూదయ తప్ప మిగిలిన సంస్థానాలన్నింటిని జయించాడు. ప్రస్తుతగవర్నరుయెడలవారికున్న సన్నిహిత సంబంధాన్నిబట్టి గవర్నరు యొక్క ఉద్రిక్త స్థితి వారి మీద పడెను. యూదులు సబ్బాతు దినమును ఆచరించుట మానరని తెలిసికొని యెరూషలేమును ద్వంసం చేసి, లోపరచుకొని వారిలో లక్ష మంది యూదులను ఐగుప్తుకు చెరకొని పోయెను. **(సశేషం)**

**దేవుని ప్రేమ ఇదిగో**

# నీ సృష్టికర్త

సహజంగా మనుష్యులు నూతన సంవత్సరంలో సంతోషంగా, విందులు వినోదాలతో గడపాలని, కష్టమనేది రాకుడాదని అన్నీ తమకు అనుకూలంగా ఉండాలని ఆశిస్తుంటారు. రకరకా ప్రణాళికలు, ఆలోచనలు, ఉద్దేశాలు కలిగి ఉంటారు. ఎవరికి వారు దేవుడు ఈ నూతన సంవత్స రమును తమ కోరికలు, ఆశలు, ఉద్దేశాలు నెరవేర్చుకొను టకు ఇచ్చిన సమయంగా భావిస్తుంటారు. అయితే దేవుని వాక్యం ఏమి చెప్తుంది అంటే దుర్దినములు వస్తాయని, అవి రాకముందే దేవునిని జ్ఞాపకం చేసుకోమని హెచ్చరి స్తుంది. *“దుర్దినములు రాకముందే... నీ బాల్య దినములందే నీ సృష్టికర్తను స్మరణకు తెచ్చుకొనుము” ప్రసంగి 12:1,2.* సృష్టికర్తను జ్ఞాపకం చేసుకోవడం అంటే ఆయన గురించి, ఆయన వ్యక్తిత్వాన్ని వ్యక్తిగతంగా తెలుసుకోవడం.

*యెహోవా ఉత్తముడని రుచిచూచి తెలుసుకొనుడి కీర్తన 34:8.* దేవుడు సృష్టించిన వాటిని పరిశీలనగా చూసి, ఆలోచిస్తే ఆయన శక్తి సామర్థ్యాలు, ఆయన గుణగణాలు మనకు అర్థమవుతాయి అని బైబిల్ సెలవిస్తుంది.

*“ఆయన (దేవుని) అదృశ్యలక్షణములు, అనగా ఆయన నిత్యశక్తియు దేవత్వమును జగదుత్పత్తి మొదలుకొని సృష్టింప బడిన వస్తువులను ఆలోచించటం వలన తేటపడు చున్నవి” రోమా 1:20.* సృష్టిలో ఎన్నో వింతలు, అద్భుతాలు ఉ న్నాయి. అయితే అన్నింటిలో విశిష్టమైనది ప్రాముఖ్యమైన అద్భుతమైన సృష్టి మనిషి. కాబట్టి ముందుగా మానవ నిర్మాణాకునిగా దేవున్ని తెలుసుకొనుటకు ప్రయత్నిద్దాం.

వైద్యపరంగా, సాంకేతికంగా ఎంతో పురోగాభివృద్ధిని సాధించిన, సాధించామని చెప్పుకునే మానవ మేధస్సుకు అంతుచిక్కని ఎన్నో చిక్కుప్రశ్నల వాస్తవిక రూపం మానవ దేహం. ఎందుకంటే ఇప్పటికి మనిషి ప్రాణం ఎక్కడుందో ఎవరికీ తెలియదు. ఒకరు లంగ్స్ ఫెయిల్ అయి చనిపోతే, మరొకరు హార్ట్ ఫెయిల్ అయి చనిపోతారు. ఇంకొకరు ఇంకొక కారణంతో తమ ప్రాణాన్ని వదలడం మనం చూస్తున్నాం కదా! మానవ దేహం ఒక అద్భుతాల గని అనవచ్చు. అందుకే సంక్లిష్టమైన మానవ నిర్మాణాన్ని రకరకాల విభాగాలుగా విభజించి వైద్యుల అధ్యాయనం చేస్తున్నారు. అందుకే కంటికి ఒక డాక్టర్, పంటికి ఇంకో డాక్టర్, ఇలా దేహంలోని ప్రతి అవయవమును గూర్చి వివరించు ప్రత్యేక విభాగమున్నది. కంటిని గూర్చిన అధ్యయన విభాగమును ఆప్తమా లజీ అని, కిడ్నీల గూర్చిన అధ్యయన విభాగాన్ని నెఫ్రాలజీ అని, హృదయ సంబంధిత అధ్యాయాన్ని కార్డియాలజీ అని వివిధరకాల విభాగా లున్నాయి. కొన్ని వేల సంవత్సరాలుగా అధ్యాయనం చేసినప్పటికి ఎన్నో సమాధానాలు లేని ప్రశ్నలతో పాటు కొన్ని ఆశ్చర్యకరమైన సంగతులు కనిపెట్టారు శాస్త్రవేత్తలు. వాటిలో కొన్ని ఈ సంచికలో చూద్దాం.

1. మనస్సు, మనస్సాక్షి అంటే ఏంటి?
2. మానవుని ప్రాణం ఎక్కడుంది?
3. డి.యన్.ఏ లో ఉన్న పూర్తి సమాచారం ఏంటి?
4. వేలిముద్రలు, వాటి నమూనాలకు కారణం ఏంటి?
5. ప్రేగుల్లో ఉండే మంచి బాక్టీరియా ఒక్కొక్కరికి ఒక్కోలా ఎందుకు ఉంటాయి? వంటి అనేక ప్రశ్నలకు సైన్స్ సమాధానం కనుక్కోలేకపోయింది.

1. మానవుని దేహంలో గుండె అత్యంత ప్రాముఖ్యమైన అవయవం. గుండె కొట్టుకుంటేనే మనం ప్రాణాలతో ఉంటాం. గుండె కొట్టుకోవడం ఆగిపోతే మనం చనిపోతాం. మనం నిద్రపోతున్నా గుండె మాత్రం అలుపనేది లేక మనం బ్రతికినంత కాలం పనిచేస్తూనే ఉంటుంది. ఒక రోజుకు దాదాపుగా 100000 సార్లు గుండె కొట్టుకుంటుంది. అంటే సంవత్సరానికి 36500000 సార్లు కొట్టుకుంటుంది. అంటే 60 సంవత్సరాల మనిషి జీవితంలో 2190000000 సార్లు గుండె కొట్టుకుంటుందనమాట. ఎంత ఆశ్చర్యమో కదా!

2. ఒక మనిషిలోని నరాలన్నిటిని కలిపితే వాటి పొడవు దాదాపు 97,000 కిలోమీటర్లు ఉంటుంది. అంటే వాటితో

భూమిని రెండుసార్లుకు పైగా చుట్టవచ్చు. ఎందుకంటే భూమి చుట్టు కొలత 40,075కి.మీటర్లు మాత్రమే.

3. పొట్టలో ఆహారం జీర్ణమవ్వడంలో ఉపయోగపడే హైడ్రో క్లోరిక్ యాసిడ్ ఎంత శక్తివంతమైనది అంటే ఆ ఆమ్లం ఒక బ్లేడ్‌ను కరిగించగలదు.

4. మన కన్ను దాదాపు పది కోట్ల రంగులను గుర్తించగలదు.

5. మన మెదడుకి దాదాపు 2.5 పెటాబైట్స్ మెమరీ కలదు అంటే దాదాపు 4.7బిలియన్ పుస్తకాలలో ఉన్న సమాచారాన్ని మానవ మెదడులో నిక్షిప్తపరచవచ్చు.

మానవ దేహము, దానిపనితీరు, దాని సామర్థ్యములను గురించి నిశితంగా పరిశీలిస్తే ఇంతటి అద్భుతమైన శరీరమును నిర్మించిన, నీ నా సృష్టికర్తయైన దేవుని తలంచకుండా ఉండలేము. అయితే ఆయన సృష్టే ఇన్ని ఆశ్చర్యాలతో అద్భుతాలతో మిళితమై ఉన్నది అంటే ఇక సృష్టికర్త అయిన దేవుని యొక్క శక్తి సామర్థ్యాలను, జ్ఞానాన్ని అంచనా వేయుటకు కూడా మనిషి సరిపోడు అని ఇట్టే అర్థమౌతుంది.

*"నా అంతిరింద్రియములు నీవే కలుగజేసితివి. నా తల్లి గర్భమందు నన్ను నిర్మించినవాడవు నీవే. నీవు నన్ను కలుగ జేసిన విధము చూడగా భయమును ఆశ్చర్యమును కలుగుచున్నవి. అందునుబట్టి నేను నీకు కృతజ్ఞతాస్తుతులు చెలించుచున్నాను. నీకార్యములు ఆశ్చర్యకరములు" కీర్తన 139:13,14*


దావీదు తన పుట్టకను గూర్చి, తన అంతరింద్రియములను గూర్చి, ఆలోచించి దేవుని ఔన్నత్యాన్ని గ్రహించాడు అందుకే దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లిస్తున్నాడు. మరి నీ సృష్టికర్త పట్ల నీ వైఖరి ఏమిటి? శక్తివంతుడైన నీ సృష్టికర్తకు భయపడుతున్నావా? ప్రేమించి నీకిచ్చిన అద్భుతమైన దేహమునుబట్టి ఆయనకు కృతజ్ఞత కలిగి జీవిస్తున్నావా? ఈ నూతన సంవత్సమును ఆయనను ఎరిగి యుండుట ద్వారా సంబరం చేసుకొనుటకు ప్రయత్నించుము.

ఇంకా ఇటువంటి ఆశ్చర్యకరమైన సంగతులు మనిషి దేహం గురించి ఎన్నో ఉన్నాయి. వాటన్నిటిని ఒక్కొక్కటిగా తరువాయి సంచికలలో ధ్యానిద్దాం.

**(సశేషం)**

## చందాదారుల వివరములు

1. అపో. ఎబినేజర్‌గారు (హైదరాబాద్)–1500 (నెలకు)
2. గంధం డేవిడ్ నీలకాంత్ (నెల్లూరు) –1000
3. మేరిసలోమి, సిరివెళ్ళ, కర్నూలుజిల్లా 5000/–
4. వి. రత్నమ్మ, హైదరాబాద్ 350/–
5. జి. కళావతి, ఒంగోలు 350/–
6. వి. కస్తూరి, భీమవరం 500/–
7. జయ, గుంటూరు – 1500/–
8. కె. రజిని, నరసరావుపేట – 1000/–
9. శ్రీమతి శాంతాగ్రేస్, మచిలీపట్నం 500/–
10. శ్రీమతి కె. కల్పన, గోవా – 350/–
11. శ్రీ జి. వెంకటేశ్వర్లు, కొత్తపల్లి – 350/–
12. శ్రీమతి సి.హెచ్.స్వయంప్రభ, చిలకలూరిపేట– 350/–
13. కె. రాజేష్, రాజమండ్రి – 350/–
14. శ్రీమతి వై. సంధ్యారాణి, ఒంగోలు – 2000/–
15. పి.వి.రెడ్డి, ఒంగోలు – 500/–
16. బి. నెహెమ్యా, చిన్నగంజాం – 500/–
17. నైటింగేల్, నెల్లూరు – 500/–
18. మారనాత బైబిల్ సెమినరీ, విజయవాడ – 500/–
19. డి. శ్యామ్‌సిన్హా, బాపట్ల – 500/–




కొడవటికంటిగారి చివరి నవల
**"మిక్కిలి సాత్వికుడు"** (మోషే కథ)

సాక్ష్యము

# ఆశ్రయాస్పదము

నా పేరు లక్ష్మి. ఒంగోలు వాస్తవ్యురాలను. నేను నా తోబుట్టవులు, నా తల్లిదండ్రులతో సహా క్రీస్తును ఎరిగిన వారము.

మా తల్లిగారు పుట్టుకతో ముస్లిం మతానికి చెందిన వారు. మా బాల్యవయస్సులో అంటే దాదాపు 25 సంవత్సర ముల క్రితం మా తల్లిగారికి గర్భసంచి క్యాన్సర్ సోకింది. ఆ సమయంలో సరియైన అత్యాధునిక ఆరోగ్య సేవలు అందుబాటులో లేకపోవడం ఒక సమస్య అయితే మా తల్లిదండ్రులు మతాంతర వివాహం అవ్వడం వలన ఆర్థిక ఇబ్బందులు మరొక సమస్య. అక్క, నేను హాస్టల్‌లో చదువుకొనుచుండగా చెల్లెలు మరి చిన్న పిల్ల. ఆమె బాధ్యత అన్నిటికంటె పెద్ద సమస్య. ఇన్ని సమస్యలతో ఒంటరిగా కొట్టుమిట్టాడుతున్న మా తల్లి గారు, క్రైస్తవుడైన మా నాన్న గారి వలన యేసును అంగీకరించారు. ఆ దేవ దేవుని కృప వలన అన్ని ఇబ్బందులలోను ఆమెకు రేడియోథెరపీ జరిగింది. కేవలం దేవుని కృప వలననే అమ్మకు ఆ కాలంలో నే సరియైన వైద్యం అందింది. ఇరవైయైదు సంవత్సరాలుగా ఆమెను కాపాడుతూ వస్తున్న ఆ దేవదేవునికి వేలకొలది వందనాలు చెల్లిస్తున్నాను.

క్రీస్తును స్వంత రక్షణగా అంగీకరించిన అమ్మ తన జీవితంలో ఎన్నో మేలులను అనుభవించిందనుటకు ఆమె కూతురిగా నేనే సాక్షిని. 2023 మార్చి చివరిలో అమ్మ మా ఇంటి ముందు ఉన్న మెట్ల మీదుగా రోడ్డు మీదకు పడిపోయింది. మా ఇళ్ళు కాస్త ఎత్తుగానే ఉంటుంది. ఆమె పడిపోవడానికి కారణం ఏంటో సరిగ్గా తెలియదు. కళ్ళు తిరిగి పడిపోయిందో, కాలు జారి పడిపోయిందో ఆమెకు తెలియలేదు. దేవుని దయ వలన చిన్న దెబ్బతో పోయింది. వాస్తవానికి ఆమె క్రిందపడిపోయినప్పుడు దొర్లుకుంటూ ఎదురింటి పూల మొక్కలు ఉన్న స్థలం వద్ద పడింది. అక్కడ ఉన్న ఒక కోపైన నాపరాయి ఆమె కళ్ళకు తగలవలసింది. త్రుటిలో తప్పి ప్రక్కన పడింది. అక్కడ ఉన్న నాపరాయి, అది ఉంచబడిన స్థితిని చూచిన వారందరూ కేవలం దేవుడే తప్పించాడు అని చెప్పగలరు. దేవునికి స్తోత్రం.

మోకాలుకు చిన్న దెబ్బ తగిలింది. దగ్గర్లో ఉన్న ఆర్.యం.పి వద్ద మందులు తీసుకున్నది పది రోజులైనా గాయం మానలేదు, కాలు వాయసాగింది. ఎందుకైనా మంచిదని ఆర్థోపెడిక్‌ని కలసి, ఎక్స్‌రే తీయించాము. ఎముకకు ఏమి కాలేదు అని టాబ్లెట్స్ ఇచ్చాడు డాక్టర్. మందులు వాడి క్రమం తప్పకుండా డాక్టర్‌ను సంప్రదించి రెగ్యులర్ చెకప్స్‌కు వెళ్ళాము. అయినా అమ్మ కాళ్ళ వాపు తగ్గలేదు. ఇంకెవరో చెప్పడంతో వేరే హాస్పిటల్‌కి వెళ్ళాము. వయసు రిత్యా వచ్చిన వాపే తప్ప ఎముకల (ఆర్థోపెడిక్) డాక్టర్ చూడవలసింది ఏమి లేదని చెప్పాడు డాక్టర్. ఇక చేసేది ఏమి లేక ఆ కాళ్ళ వాపుతోనే ఉండాల్సి వచ్చింది.

ఆ కాళ్ళ వాపు వలన నడవడం కష్టమైంది. అడుగు భూమి మీద స్థిరంగా పడుతున్నదో లేదో తెలియక నడవాలి అంటే భయం పట్టుకున్నది. ఫలితంగా ధైర్యంగా నడవలేక పోతుంది. క్రింద కూర్చులేదు, మెట్లు ఎక్కలేదు. ఆ కారణంగా చర్చికి వెళ్ళలేకపోయింది. దాదాపు నెల గడిచింది ఇంతలో చెవిపోటు వచ్చింది. దానికి వైద్యం చేయించే క్రమంలో అమ్మకి బి.పి. ఎక్కువ అయిందని ఏవేవో పరీక్షలు చేసి ఊపిరితిత్తుల నాళాలలో ఒత్తిడి వలన బి.పి పెరుగుతుందని, కాళ్ళవాపులకు కారణం అదే అన్నాడు ఇంకో మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్. సరే అని ఒక నెలపైగా ఆ మందులు వాడాము. అమ్మ బి.పి అయితే తగ్గింది కాని కాళ్ళ వాపు తగ్గలేదు. ఇలా కాదని కిమ్స్ మల్టీస్పెషాలిటి హాస్పిటల్‌లో చూయించాము. రక్తపరీక్షలు చేసి మందులు ఇచ్చాడు డాక్టర్.

అలా నాలుగైదు హాస్పిటల్‌కి వెళ్ళడం, రక్త పరీక్షలు చేయించడం, వారిచ్చిన మందులు వాడటమే తప్ప

పరిస్థితిలో మార్పు రాలేదు సరికదా అమ్మ ఆరోగ్యం క్షీణించింది. కాళ్ళవాపు తగ్గకపోగా, అమ్మకు నడుము నొప్పి మొదలైంది. కాసేపు కూడా కూర్చోలేకపోయేది. పడుకున్న అమ్మ అయ్యా అంటూనే ఉండేది. తినటం తగ్గించింది. పూర్తిగా మానేసింది అనవచ్చు. ఆహారంలో రకరకాల మార్పులు చేశాము. చుట్టు ప్రక్కల వారు చెప్పినా ప్రతిదీ చేశాము. కానీ ఏదైనా రెండురోజులే. మూడోరోజు ఆ ఆహారం ఆమెకు రుచించేది కాదు. పైగా మధ్య మధ్యలో వాంతులు. మందులు మింగడం కూడా కష్టమైంది. రాను రాను పరిస్థితి క్షీణించసాగింది.

ఇంతలో మా బంధువులు చెప్పడంతో ఇంకో వైద్యున్ని సంప్రదించాము. రక్తపరీక్షలు చేసి థైరాయిడ్ అని కొత్త రోగం చెప్పాడు. మరలా కొత్త మందులు వాడటం ప్రారంభించాము. వారం రోజుల తరువాత వేసుకున్న మందులు కూడా వాంతాలు అవ్వసాగాయి. దాంతో హాస్పిటల్‌కి వెళ్ళగా సెలైన్ పెట్టి, రక్త పరీక్ష చేసి ఇంకేదో క్రొత్త రోగం చెప్పాడు. అయితే ఎందుకైనా మంచిదని అబ్డామినల్ స్కానింగ్ తీయించడంతో పొట్టలో రాళ్ళు ఉన్నాయని తెలిసింది. డాక్టర్ మెడికల్ ఎమర్జెన్సీ అని సాధ్యమైనంత త్వరగా గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగానికి చెందిన డాక్టర్‌ను కలవమని, గుంటూరు వెళ్తే మంచిదని సలహా ఇచ్చాడు డాక్టర్.

ఊహించని ఈ పరిస్థితిని జీర్ణించుకొని తేరుకోవ డానికి మాకున్న ఒకే ఒక్క ధైర్యం దేవుడు. దేవుడు ఈ పరిస్థితిని మా జీవితాలలో అనుమతించడం వెనుక ఆయన ప్రణాళిక ఉండే ఉంటదని అనుకున్నాం.

*దేవుడు మనకు ఆశ్రయమును దుర్గమునైయున్నాడు ఆపత్కాలములో ఆయన నమ్ముకొనదగిన సహాయకుడు కీర్తన 46:1*

ప్రయాణంలో ఆ రాత్రి సమయం వృథా అవుతుందని ఆలోచించి 2022లో అమ్మకు గాల్‌బ్లాడర్ సర్జరీకి ముందు ఎండోస్కోపి చేసిన గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్‌ను కలిసిన మీదట ఆ డాక్టర్ యూరినరీట్రాక్ ఇన్‌ఫెక్షన్ ఉందని, దాదాపు 1000 మి.లీ యూరిన్ బ్లాడర్‌లో ఉండడంతో అవి ఫ్రీగా పాస్ అవ్వకపోవడంతో ఆమెకు నడుం నొప్పి, కాళ్ళ వాపులు వచ్చాయని, అంతేకాక యూరిన్ ఆగిపోవడం వలన క్రియాటిన్ చాలా పెరిగి పోయిందని, కిడ్నీలు డామేజ్ అయ్యే స్థితి ఉందని చెప్పి ఎమర్జెన్సీ కేస్ అని ఇంటెన్సివ్ కేర్‌లో ఉంచారు. పొట్టలో ఉన్న రాళ్ళ వలన ప్రస్తుతం ఏ ఇబ్బంది లేదు. వాస్తవానికి ప్రస్తుతం గ్యాస్ట్రో కేస్ కాదు. అయినా సరే చూద్దాం అని అన్నాడు డాక్టర్.

క్రియాటిన్‌ని కంట్రోల్ చేయడం కోసం యాంటీ బయాటిక్స్ సెలైన్‌ల ద్వారా ఇచ్చి ప్రతిరోజు రక్తపరీక్ష చేసి క్రియాటిన్ వాల్యు చెక్ చేసేవారు. దేవుని దయవలన క్రియాటిన్ తగ్గుతుంది. కాబట్టి పర్లేదు అన్నాడు డాక్టర్. క్రియాటిన్ తగ్గకపోతే కిడ్నీలు పాడై డయాలసిస్‌కి వెళ్లాల్సిన పరిస్థితి వచ్చేది కాబట్టి దేవుడు పరిస్థితిని ఇంకా దిగజార్చక మా పట్ల కృప చూపాడు అనుకుని మనసులోనే దేవునికి కృతజ్ఞతలు తెలుపుకున్నాను.

ఐ.సి.యులో జాయిన్ అయిన రెండవరోజు నుండి పసరు వాంతులు ప్రారంభమయ్యాయి. ఒక్కరోజులో ఆరు సార్లు వాంతులు అయ్యాయి. అంతకు ముందు నాలుగు రోజుల నుండి అమ్మ విరోచనానికి వెళ్ళలేదు. సరిగా తినకపోవడం వలన వెళ్ళలేదు అని అనుకున్నాం. అదికాక ఆమెకు గాల్‌బ్లాడర్ సర్జరీ అయింది. కాబట్టి కాన్స్టిపేషన్ సహజమే అనుకున్నాం. మరునాడు ఎండోస్కోపి చేసి ప్రేగుల నిండా పసరు ఉందని చెప్పారు. సహజంగా అయితే ఆ పసరు, అన్నం అరగించడం ద్వారా మల రూపంలో బయటకు వెళ్తుంది కానీ అమ్మ కొన్ని రోజులుగా ఆహారం తీసుకోకపోవడం మరియు కాన్స్టిపేషన్ కారణంగా పసరు ప్రేగుల్లో నిల్వ ఉన్నది అని చెప్పారు. చివరికి ఎలాగో ముక్కు నుండి చిన్న పైప్ వేసి ఆ పసరు అంతా బయటకు తీశారు. మూడు రోజులు నీరు కూడా ఇవ్వకుండా ఉంచారు అమ్మని.

పసరు అయితే తీశారు. మూడురోజుల తరువాత అమ్మకు చిన్న చిన్న మోతాదుల్లో నీరు ఇచ్చారు. పర్లేదు

అనిపించి యాపిల్ జ్యూస్ ఇవ్వమన్నారు జ్యూస్ వెంటనే వాంతి చేసుకుంది. డాక్టర్‌ను అడిగితే ప్రేగుల్లో కదలిక లేదమ్మ వేరే సర్జన్‌కి చూపించి సలహా అడుగుదాం అన్నాడు. ఇది ఇంకో కొత్త సమస్య. ఏం చేయాలో తెలియదు. ఒక్కో డాక్టర్ ఒక్కో క్రొత్త రోగం పేరు చెప్పడం ఏది నిజమో ఏది అబద్ధమో తెలియదు. కానీ ఏమి చేయగలిగింది లేదు. చివరికి ఆ హాస్పిటల్‌లోనే వేరే సర్జన్‌ను సంప్రదించగా ప్రేగుల్లో కదలిక లేక పసరు క్రిందకు వెళ్ళడం లేదు. క్యాన్సర్ ట్రీట్‌మెంట్ నిమిత్తం ఇచ్చిన రెడీయేషన్ వలన ప్రేగులు డ్యామేజ్ అవడం, లేదా మెత్తబడి సరిగ్గా పనిచేయకపోవడం, ప్రేగులు కుంచించుకుపోవడం జరుగవచ్చు కాబట్టి సర్జరీ తప్ప వేరే పరిష్కారం లేదు, సర్జరీ కూడ పూర్తి పరిష్కారం కాదు. ఎందుకంటే వయసురిత్యా కుట్లు సరిగా నిలబడక పోవచ్చు, ఒక వేళ సర్జరీ సక్సెస్ అయినా మళ్ళీ అదే సమస్య రావొచ్చు అన్నాడు.

*రాజుల చేతనైనను నరుల చేతనైనను రక్షణ కలుగదు వారిని నమ్ముకొనకుడి కీర్తన 146:3*

అమ్మ ఆరోగ్య సమస్య ఏంటో డాక్టర్లకి పూర్తి అవగాహన లేదు, సరియైన పరిష్కారం లేదు. అందులోను ఓపెన్ సర్జరీ అంటే ఈ వయస్సులో ఆమె శరీరం తట్టుకుంటుందో లేదో, దేవుడా సర్జరీ అవసరం లేకుండా చేయి అని మనసులో అనుకుంటూ ఐ.సి.యు బయట కాపలా కాయడం తప్ప ఏమి చేయలేని స్థితి. మా నాన్న గారు మాత్రం సర్జరీ అవసరం లేకుండా దేవుడు చేస్తాడు అని గట్టి నమ్మకంతో ఉన్నారు. ఏమి చేయలేము. దేవుని మీద భారం వేయడం తప్ప.

సర్జరీ చేయాలన్నా సమస్య ఎక్కడుందో కనిపెట్టడానికి యం.ఆర్.ఐ., సి.టి స్కాన్ కావాలి అన్నారు. యం.ఆర్.ఐ స్కాన్ వెంటనే తీయించాము కానీ సిటి స్కాన్‌కి వెళ్ళాలంటే క్రియాటిన్ నార్మల్‌కి రావాలి అన్నారు. ఐ.సి.యుకి వచ్చిన పేషంట్స్ అందరూ ఒక్కొక్కరిగా డిశ్చార్జ్ అవుతున్నారు అమ్మ తప్ప. అమ్మకి భయం పట్టుకుంది నన్ను ఇక్కడ నుండి ఇంటికి తీసుకెళ్ళండి అని గొడవ స్టార్ట్ చేసింది. పూర్తి పరిస్థితి ఆమెకు చెప్పలేము. అలానే ఆరు రోజులు గడిచిన మీదట క్రియాటిన్ నార్మల్ కి వచ్చింది దాంతో రూంకి మార్చారు.

రూమ్‌కి అయితే మార్చారు కాని సర్జరీ సంగతి ఇంకా ప్రశార్థకంగానే ఉంది. మరునాడు అమ్మకి విరోచనం అవ్వడంతో డాక్టర్ రెండురోజులు ఆహారం పెట్టి అబ్జర్వ్ చేసి తరువాత సర్జరీ గురించి ఆలోచిద్దాం అన్నారు. దేవుని దయవలన అమ్మ ఆహారం తీసుకోసాగింది. పరిస్థితి మెరుగు పడటంతో డిశ్చార్జ్ చేశారు.

నడుం నొప్పి పూర్తిగా తగ్గింది. ఇంటికి వచ్చిన తరువాత కాస్త పర్లేదు అనుకుంటుండగా మరలా కాళ్ల వాపులు మొదలయ్యాయి. డాక్టర్‌ని అడిగితే ఇన్ఫెక్షన్ అయి ఉంటుందని మందులు ఇచ్చారు. కాళ్ళు వాస్తే నడవడం, మెట్లు ఎక్కడం, క్రింద కూర్చోవడం కుదరక చర్చికి వెళ్ళడం మానేసింది. దాదాపు 9 నెలలుగా చర్చికి వెళ్ళలేదు. మా అమ్మగారికి దేవుని మీద విశ్వాసం ఉన్నప్పటికి పూర్తిగా ఆధారపడదు. అంటే డాక్టర్ దగ్గరకు వెళ్తే తగ్గిద్ది, మందులు వేసుకుంటే తగ్గిద్ది అనే అభిప్రాయం కలిగి డాక్టర్ల అంటే గురి కలిగి ఉండేది. ఈ అనుభవంతో పూర్తిగా దేవుని మీద ఆధారపడటం అలవరచుకుంది. దేవునికి వందనాలు. కాళ్ల వాపుల గురించి డాక్టర్‌కి చెప్పదలచుకోక దేవుని మీద భారం వేసి రోజు ప్రార్థించసాగాము. చర్చికి వెళ్ళి సాక్ష్యం చెప్పే స్థితి దయచేయమని ప్రార్థనలో ఏకీభవించగా ప్రస్తుతం కాళ్ళ వాపులు పూర్తిగా తగ్గాయి. దేవునికి స్తోత్రం.

*మనుష్యులను నమ్ముకొనుటకంటే యెహోవాను ఆశ్రయించుట మేలు కీర్తన 118:8*

హాస్పిటల్ నుండి డిశ్చార్జ్ అయ్యి నెల రోజులు దాటింది. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం పర్లేదు. కాని పూర్తి ఆరోగ్యం ఇంకా పొందుకోలేదు. యూరినరీట్రాక్ ఇన్‌ఫెక్షన్ తగ్గడానికి సమయం పడుతుందట. మా అమ్మ గారి పూర్తి ఆరోగ్యం కొరకు, దేవుడు మాకు చేసిన మేలుకు కృతజ్ఞత కలిగి జీవించునట్లు మీ వ్యక్తిగత ప్రార్థనలో జ్ఞాపకం చేసుకో వలసిందిగా కోరుతున్నాను.

ఆధునిక దృక్పథం

# క్రొత్త కోణాలు

**క్రీ॥పూ॥ 1445-1405 మధ్యకాలంలో మోషే ధర్మశాస్త్రం అవతరించింది. అది స్వయాన సీనాయి కొండనుండి యెహోవా దేవుడు తన మహిమా శక్తులతో ప్రకటించాడు. ఇశ్రాయేలీయుల నైతిక, రాజకీయ, మతాచార ప్రామాణికాలతో కూడిన దేవుని చట్టము, మానవ శిరసావహ్య శాసనము. దాదాపు 1500 సంవత్సరాలుగా దేవుని నిత్యస్వాస్థ్య నిబంధనకు షరతుగా కొనసాగింది. నేటికీ యూదులకు కొనసాగుతుంది, మరో రూపంలో క్రైస్తవులలో కొనసాగుతుంది. ఆ మరో రూపమే యేసుక్రీస్తు ప్రభువు. ఆదికాండము నుండి సూచింపబడిన యెహోవా రక్షణ రేఖ. పాత నిబంధనలోని ప్రవచనాల శరీరధారి.**

ఆ యేసు 12 ఏళ్ళ వయస్సులో పండుగ నాచరించుటకై వాడుక చొప్పున (తిరునాళ్ళు?) యెరూషలేము పోయాడు. పోయినవాడు దేవాలయంలో "బోధకుల మధ్య కూర్చుండి వారి మాటలను ఆలకించుచు వారిని ప్రశ్నలడుగుచుండెను" (లూకా 2:46). అంటే, ఆనాటికే, పదిహేను శతాబ్దాలకే దివ్యమైన మోషే ధర్మశాస్త్రం, బోధకుల (శాస్త్రుల, పరిసయ్యుల, యాజకుల) చేతుల్లో వక్రభాష్యాలకు, షుష్కవాదాలకు నెలవయింది. అందుకే బాలయేసు ప్రశ్నాపరంపరుల అంపశయ్య అయింది.

ఈ బోధకులంటే ప్రభువునకు మొదటి నుండి ప్రొద్దెదురు. అందుకే ఒక అధ్యాయం పొడుగునా (మత్త.23) తూలనాడాడు. "మోషే పీఠమందు కూర్చుండు వారు గనుక వారు మీతో చెప్పు వాటినన్నిటిని అనుసరించి గైకొనుడి, అయినను వారి క్రియల చొప్పున చేయకుడి. వారు చెప్పువారేగాని చేయువారు కాదు" (వ.2) అని కుండబ్రద్దలు కొట్టినట్లు చెప్పేశాడు. "అయ్యో, వేషధారులైన, శాస్త్రులారా, పరిసయ్యులారా, మీరు పుదీనాలోను సోపు లోను జీలకర్రలోను పదియవవంతు చెల్లించి, ధర్మశాస్త్రంలో ప్రధాన విషయాలను, అనగా న్యాయమును కనికరమును విశ్వాసమును విడిచిపెట్టితిరి" (వ.23) అని తోలు ఒలిచాడు. "మీరు సున్నము కొట్టిన సమాధులను పోలియున్నారు" (వ.27) అని ఈసడించుకున్నాడు.

యేసుప్రభునకు ధర్మశాస్త్రము మీద ఎట్టి విరోధమూ లేదు. ఆ శాస్త్రమును స్వప్రయోజనాల కొరకు, తాడిత, పీడిత, దళిత జనులను ముక్కుపిండి సర్వ నాశనం చేయటానికి దేవాలయాన్ని, సెనెడ్రిన్‌సభను సునగోగులను వారి దొరతనంలో ఉంచుకుంటున్న బోధకుల మీద, వారి బోధల మీదనే ఆయన ఆక్రోశం, ఆవేదన. "ధర్మశాస్త్రము నైనను, ప్రవక్తల వచనములనైనను... నెరవేర్చుటకేగాని కొట్టివేయుటకు నేను రాలేదు..." అని ఢంకా జాయించి తన పరలోక రాజ్య ప్రణాళికలో ప్రకటించాడు (మత్త.5:17). అదే మన కందరకు ప్రీతి పాత్రమైన కొండమీద ప్రసంగం (5,6,7). అయితే, యిక్కడే ఉంది కిటుకు! యేసుప్రభువు ధర్మశాస్త్రంలోని మాటలనైతే యధాతథంగా అంగీకరించాడు కాని ప్రతిమాటను వేరొక క్రొత్తకోణంలో చూడమని కవ్వించాడు.

పది ఆజ్ఞల్లో 'నరహత్య చేయకూడదు' అని ఉంది. సగటు మనిషి ఎవరైనా నేను నరహత్య చేయనులే అనే భరోసాలో ఉంటాడు. అయితే నరహత్య అంటే గొంతు పిసికో, కత్తితో పొడిచో చంపనవసరంలేదు. "తన సహోదరుని మీద (నిర్నిమిత్తంగా) కోపపడు ప్రతివాడు విమర్శకు లోనగును" (మత్త.5:22) అని విశదీకరించాడు. ఈ క్రొత్తకోణంలో చూస్తే ప్రొద్దున లేచింది మొదలు మనమెన్ని నరహత్యలు చేస్తున్నామో లెక్క వేసికోవచ్చు.

కనుక ఆనాటి శాస్త్రులు లేక పరిసయ్యులుగాని, నేటి పోపులు, సంఘపీఠాధిపతులుగాని, సంఘకాపరులుగాని సువార్త అనగా పాపులను రక్షించు పథకంతో గాక తమ ఇష్టానువాంఛలకు ప్రాతినిధ్యమిచ్చు విధంగా సంఘమును, దేవుని వాక్యమును తమ కనుకూలంగా బోధిస్తారు. మనం వాక్యాన్ని క్రొత్త కోణాల్లో అధ్యాయనం చేయాలి. ప్రతి విషయాన్ని పాతమూసలోనే ఆలోచించడం మానాలి.

**కీ॥శే॥ అద్దంకి జాన్‌వెస్లీగారు**, ఒంగోలు.

(1999లో నిత్యజీవజలము మాస పత్రిక కొరకు వ్రాసిన 'క్రొత్తకోణాలు' యధాతథంగా ప్రచురిస్తున్నాం.)

**వచ్చే మాసం: జక్కయ్య ఉదంతం**

# కృపాదానం

ఆ విధంగా ప్రభువు తన స్వరముతో పిలిచి నప్పుడు కృపాదానం గారి విశ్వాసం బలపడింది. దేవుని సేవ చేయాలనే తన కోరికకు దేవుడు ఆమోదం తెలిపినట్లు భావించి ఉద్యోగం మానివేసి సేవ ప్రారంభించాడు.

ఆ సేవ ఆంధ్రా అంతటా సంఘాలు ఏర్పడటమే కాక, తమిళనాడులో ఈరోడ్ వరకు వ్యాపించింది.

క్లొపేటలో 250 గదుల స్థలం ప్రభువు ఇచ్చాడు. 50 గదుల స్థలములో గ్రానైట్ రాయితో పెద్ద చర్చి నిర్మించాడు. అనాథ శరణాలయాలు నిర్మించి పేదవారిని ఆదుకున్నారు. మూడు అనాథ శరణాలయాలలో వేలాదిమంది చదువు కున్నారు. ఎంతోమంది సువార్తికులయ్యారు. కృపాదానం గారి సేవా ఫలితంగా నేటికి ఆయన కుటుంబీకులలో మూడువంతుల మంది దేవుని సేవలో ఉన్నారు.

1958లో కృపాదానం భార్యతో కలిసి వారి ఉద్యో గాలు వదలి విశ్వాస సేవ ప్రారంభించిన సమయంలో రూపాయికి ఎంతో విలువ పెరిగింది. కృపాదానం ఇంటిలోకి ఒక్క రూపాయి బియ్యం తెస్తే, 9 మంది పిల్లలతో కలిసి 11 మంది గంజి త్రాగేవారు. కృపాదానం బాప్టిస్టు చర్చికి వ్యతిరేకంగా సేవ ప్రారంభించాడే కాని దేవుని మీద ప్రేమతో దేవుడు పిలిస్తే కాదని ప్రజలలో ఎక్కువభాగం భావించేవారు.

కృపాదానం సొంత అన్న కుటుంబము, కృపాదానం కుటుంబము క్లొపేటలోని పితరులిచ్చిన పెంకుటింట్లో నివసించేవారు.

ఒకరోజు ఉదయం కృపాదానం వాళ్ళ అన్న ఆశీర్వాదం గారి గదిలోనికి వెళ్ళి "అన్నా! టైం ఎంత? అన్నాడు. అందుకు ఆయన గోడమీద గడియారం చూస్తూ 9.30 అని దేవుడు నిన్ను నీ భార్యను సేవకు పిలిచాడు అన్నావు కదా, నీకు వాచ్ అయినా ఇవ్వలేదు, మూడు పూటలా అన్నం పెట్టడం లేదు, కనీసం గోడ గడియారం అయినా ఇవ్వలేదా? నాకు చూడు బొడ్లో చైను వాచ్, గోడమీద గంటలు కొట్టే గడియారం బల్ల మీద అలారం గడియారం చేతికి చక్కని రిస్ట్‌వాచ్" అన్నాడు.

"టైం వచ్చినప్పుడు ఇస్తాడులే అన్నా" అన్నాడు.

"నేను నీకు చూపించిన బెస్ట్ అండ్ కోలో ఉద్యోగంలో చేరు అన్ని ఊర్లు తిరుగుతూ నీ సేవ కూడ చేసుకోవచ్చు" అన్నాడు.

మా పెద్ద నాయన ఆశీర్వాదంగారు ఒంగోలులో ఉన్న ఆరు కుటుంబాల అమెరికా దొరలకు తెలుగు నేర్పించే వారు. రెండు సంవత్సరాలలోనే తెల్లదొరలు ఒంగోలుకు రావడం తగ్గిపోయింది. రాబర్ట్ వేలస్ అనే అమెరికా టూరిస్టు కృపాదానంగారింటికి వచ్చి ఆ మట్టి ఇల్లు, కరెంటు లేని దానిలో రెండు నెలలు ఉండి సేవ చేసి తిరిగి అమెరికా వెళ్ళిపోయాడు. ఆ దొరకి ఆశీర్వాదంగారు తెలుగు తర్జుమా చేసే వాడు. ఆశీర్వాదంగారు ఒక ఉదయాన్నే కృపాదానం ఇంటికి వచ్చాడు. వెళ్తూ నాకు ఏదైనా ఉద్యోగం ఉంటే ఇవ్వరా! ఇప్పుడు దొరలు లేరు కదా అన్నాడు.

కాని సువార్త సేవను బంధువర్గమని ఇవ్వలేరు కదా! అందువలన ఆర్థిక సహాయం మాత్రం చేస్తూ ఉండేవాడు కృపాదానం.

అప్పుడప్పుడు వేరు గ్రామాలు పట్టణాలలో నుండి కృపాదానంగారికి మనియార్డరు వస్తుండేవి. ఆ రోజుల్లో ఆన్‌లైనులు లేవు. అమ్మా, నాన్నకి ఈ డబ్బు పంపేవాళ్ళు ఎవరు? అన్నాను. నాన్న ఉద్యోగం చేసే రోజుల్లో కొంత మంది దేవుని సేవకులకు డబ్బు పంపేవారు. ఇప్పుడు అటువంటి వారు పంపుతున్నారు అన్నది.

నాటిరోజుల్లో పండుగలకు కొందరు క్రైస్తవులకు మిషనెరీలు సహాయం చేసేవారు. కాని కృపాదానం గారే కొన్ని కుటుంబాలకి సహాయం చేసేవారు.

1965వ సంవత్సరము వచ్చేటప్పటికి కృపాదానం గారినే దేవుడు ఒక మిషనరీగా చేసాడు. ఆయన పన్నెండు

మంది సంతానం దేవుని సేవకులయ్యారు. దాదాపు 25 గ్రామాలలో చిన్న చర్చిలు కట్టించారు. ఒంగోలులో గ్రానైటు రాయితో గొప్ప మందిరము కట్టించాడు.

కృపాదానంగారి తండ్రి జోసఫ్‌కు కొంత మాంత్రిక విద్యలు తెలుసు. కృపాదానం చిన్నతనంలో తెలంగాణాలో రైల్వేస్టేషన్‌లో దెయ్యము పట్టిన ఒకామెను చూసి దడుచుకొని ఇంటికి వచ్చాడు. జోసఫ్‌గారు ఏదో మంత్రం చదివి ఇక భయం లేదు నీకు, దెయ్యాలు నీ ముఖము చూస్తే పారి పోతాయి అన్నాడు. అప్పటి నుండి దెయ్యం పట్టినవాళ్ళు జోసఫ్ గారిని చూస్తే పారిపోయేవట.

కృపాదానంగారి తల్లి మాత్రం ఇవన్ని నీకెందుకయ్యా! నీవు ప్రభువు బిడ్డవు, ఎక్కడున్నా ఏమి చేస్తున్నా ప్రతిరోజు ఉదయం, సాయంకాలం మోకరించి ప్రార్థన చేసుకో. నీవు ఎక్కడ మోకరిస్తే అక్కడే ప్రభువు సన్నిధి ఉంటుంది అని చెప్పేది.

కృపాదానం ఎక్కువగా ప్రయాణాలు చేసేవాడు. అనేకమార్లు బొంబాయికు ప్రయాణించారు. ఉదయం అయినా సాయంకాలం అయినా రైల్లో మోకరించి ప్రార్థన చేసేవారు. 60 ఏండ్లు పైబడిన తరువాత కూడ, కారులో ప్రయాణం చేయాల్సి వచ్చినపుడు రోడ్డు ప్రక్కన పొలాల్లోకి వెళ్ళి మోకరించి ప్రార్థన చేసుకొనేవాడు. అందువలన ఆయన చనిపోయేనాటికి ఆయన మోకాటి చిప్పలు నల్లగా ఉబ్బి ఉండేవి. ఎవరు ఏమి అనుకుంటారో అని ఎప్పుడూ ఆలోచించలేదు.

నెల్లూరు మద్రాసు హైవే మీద గుమ్మళరిపూడి స్టేషన్‌కి సమీపంలో మూడు మఱ్ఱిచెట్లు దగ్గరగా ఉంటాయి. సేవకైన పిలుపు ఆయనకు కొన్ని సంవత్సరాలుగా వెంటాడు తున్నప్పటికి పదిమంది పిల్లలను పోషించవలసిన బాధ్యత తండ్రిగా తన మీద ఉన్నందున విశ్వాసం చాలలేదు. కాని మద్రాసు నుండి కంపెనీ కారులో ఒంగోలు వస్తూ ఆ మఱ్ఱిచెట్లు వద్ద కృపాదానం! నా సేవ చెయ్యి అన్న స్వరము స్పష్టముగా విన్న తర్వాత అక్కడే రోడ్డు మీద కారు ఆపమని డ్రైవరుకు చెప్పి రోడ్డు దిగి ఆ మఱ్ఱిచెట్ల నడుమ మోకరించి, ప్రార్థన చేసుకొని వచ్చి డ్రైవరుతో కారు వెనక్కి తిప్పమని చెప్పి మద్రాసు బెస్ట్ కంపెనీలో కారు అప్పజెప్పి రైలులో ఒంగోలుకు వచ్చాడు.

ఒకరోజు సాయంకాలం ఇంటి ముందు మంచము వేసుకొని కూర్చున్నాడు. ప్రక్కన తన మూడవ కుమారుడు కూర్చుని ఉన్నాడు. ప్రక్కింటిలో నుండి మాంసం కూర వండుతున్న వాసన వస్తుంది. తన కుమారుడు తండ్రిని చూస్తూ "మనకు కూర లేదా నాన్న" అన్నాడు. ఆ రోజుల్లో కృపాదానం కుటుంబం ప్రతిరోజు అన్నం తినే పరిస్థితి లేదు. విశ్వాస పరీక్ష.

కుమారుని ప్రశ్న విని కృపాదానం ఇంట్లోకి వెళ్ళి ప్రార్థన చేసుకొని వచ్చి మంచం మీద కూర్చున్నాడు. దాసు అనే మాంసం వ్యాపారి కృపాదానం ఇంటి మీదగా వెళ్తూ, కృపాదానం ఎదురుగా నిలిచి "మామ నీకు కూర తీసుకొని వస్తాను ఇంట్లోకి వెళ్ళమాక" అని చెప్పి నవ్వుతూ వెళ్ళాడు. అరగంట తర్వాత బుట్టలో పదిమందికి సరిపోయినంత మాంసం తీసుకొని వచ్చి ఇచ్చాడు.

ఇది జరిగిన పది సంవత్సరాలకు అయ్యన్నశెట్టి సత్రం ప్రక్కన కృపాదానం కొనుక్కొనిన ఇంటిలో వంట గది ప్రక్కన 14 పోల్డింగ్ కుర్చీలు వేసిన డైనింగ్ టేబులును కలిగి ఉండే స్థితిని దేవుడు కలిగించాడు.

ఒకరోజు ఉదయాన్నే మిషన్ హాస్పిటల్ పాస్టరుగారైన గంధం దేవదానంగారి జ్యేష్టపుత్రుడు మోషే (జిడ్డా) ఏదో పనిమీద కృపాదానం గారి ఇంటికి రాగా కృపాదానంగారు టిఫిన్ చేస్తున్నారు. మోషేను లోపలికి పిలిచి తన ప్రక్కన కూర్చుండ బెట్టుకొని చపాతీలు మాంసం కూర (ముగ్గురు మనుష్యులకు సరిపోయేవి) వడ్డించి తినమన్నారు. సరిగా తిండి కూడా లేని స్థితి నుండి ఎవరికైనా సమృద్ధిగా పెట్టగలిగే స్థితిని దేవుడు ఇచ్చాడు.

ఆ తరువాత ఓ రోజు మోషే నాతో ఈ సంగతి చెప్తూ అంత పెద్ద డైనింగ్ టేబుల్, అంతమంది ఒకేసారి కూర్చో గలిగినది మరెవరు చూసి ఉండరు. ఇది నిజంగా ఆశీర్వాదకరం కదా అన్నాడు. **(సశేషం)**

స్త్రీల విభాగం

# తామారు

హన్నాకృప పాఠకులకు యేసుక్రీస్తు వారి ప్రశస్త నామములో నూతన సంవత్సర శుభాకాంక్షలు.

యేసుక్రీస్తు వంశావళిలో మొదటగా పలకరించబడిన స్త్రీ తామారు. ఆమె జీవితం గురించి పరిశుద్ధ గ్రంథము ద్వారా తెలుపబడిన అంశాలు ఈ సంచిక ధ్యానభాగము.

తామారు గురించి బైబిల్ మొత్తం మీద మూడు సార్లు మాత్రమే వ్రాయబడింది. ఆదికాండం 38వ అధ్యాయంలో ఆమె గురించి వ్రాయబడిన భాగమును ధ్యానిద్దాం.

యాకోబు కుమారుడైన యూదా ఒక కనాను స్త్రీని వివాహమాడగా ఏరు, ఓనాను, షేలా అను ముగ్గురు కుమారులు పుట్టారు. యూదా తన పెద్దకుమారుడైన ఏరుకు తామారు అనే ఆమెతో వివాహం చేశాడు.

తామారు అనే మాటకు ఖర్జూరవృక్షం అని అర్థం. సహజంగానే ఏ వృక్షమైన ఫలింపుకు సాదృశ్యముగా చెప్ప బడుతుంది. అయితే తామారు జీవితం అందుకు భిన్నంగా ఉన్నది. పేరులో ఉన్న ఫలింపు జీవితంలో లేదు.

యూదా కోడలుగా, ఏరుకి భార్యగా వచ్చిన తామారు జీవితంలో వైవాహిక ఆనందం ఎక్కువ కాలం నిలువలేదు. ఆమె భర్త దేవుని దృష్టికి చెడ్డవాడైనందున అతను చని పోయాడు. ఆమెకు పిల్లలు లేరు అని వ్రాయబడినందున పెళ్ళైన అతి తక్కువ కాలంలోనే ఏరు చనిపోయి ఉ ండవచ్చు. సాధారణంగా ఇలాంటివి జరిగినప్పుడు అందరూ వేలెత్తి చూపేది భార్యనే. అది కూడ అతని జీవితంలో అడుగిడిన అతి తక్కువ కాలంలో భర్త చనిపోవడం అంటే అందరూ తామారునే నిందించి ఉ ంటారు. ఎంతో పురోగతిని సాధించామని చెప్పుకునే ఈనాటి సమాజంలో కూడా తామారునే నిందిస్తారు అనటంలో ఎటువంటి సందేహం లేదు. చనిపోయిన ఏరును గురించి వ్రాయబడిన ఒకే ఒక మాట అతను యెహోవా దృష్టికి చెడ్డవాడైనందున దేవుడు అతని ప్రాణాలు తీసుకున్నాడని. దేవుని దృష్టికి చెడ్డవాడు అంటే మనుష్యుల దృష్టిలో అతను ఖచ్చితంగా బహు దుర్మార్గుడై ఉంటాడు ఎందుకంటే దేవుడు చెడ్డవారిని, అనీతిమంతులను సైతం ఎంతో ప్రేమతో భరించేవాడు. అంతటి చెడ్డవాడైన ఏరు చనిపోవడంలో తామారు పాత్ర ఏమి లేకపోయినప్పటికి అకారణంగా ఎన్నో నిందలు , సూటిపోటిమాటలు అనుభవించి ఉంటుంది.

కనాను దేశ చట్టం లేదా ఆచారం ప్రకారం భర్త చనిపోయిన స్త్రీకి పిల్లలు లేకుంటే చనిపోయిన వ్యక్తి సోదరుడు ఆమెను వివాహమాడి మరిది ధర్మం జరిగించాలి. ఆ ప్రకారమే తామారును ఏరు తమ్ముడైన ఓనానుకి ఇచ్చి వివాహం చేశారు.

ఓనాను వలన తామారుకు పుట్టిన మొదటి సంతానం ఏరు కుమారుడు అవుతాడు తప్ప తనకు కుమారుడు కాదని తెలిసిన ఓనాను తామారుకు సంతానం కలగకుండునట్లు ప్రవర్తించి దేవుని దృష్టిలో చెడ్డవాడైనాడు. ఎందుకంటే తామారుకు సంతానం కలిగితే ఏరు స్వాస్థ్యమునకు వారసుడౌతాడు. అందులోను ఏరు జ్యేష్ఠుడు గనుక అతనికి రెండింతల ఆస్తి దక్కుతుందని ఆలోచించి తామారుకు పిల్లలు కలుగనివ్వలేదు. తామారును వివాహమాడినప్పటికి, ఆమెతో వైవాహిక ఆనందం పొందుతున్నప్పటికి ఆమెకు ద్రోహం చేశాడు. కాబట్టి దేవుడు ఓనానును చంపివేశాడు.

రెండు వివాహాలు విఫలమవ్వడం అంటే అది సాధరణ మైన దుఃఖము కాదు. తన భవిష్యత్తుకు ఆధారం లేని జీవితం. అందులోను తోటివారి మాటలు బాధతో పాటు ఖచ్చితంగా భయాన్ని కలిగిస్తాయి. ఆమె ప్రమేయం ఏమి లేకుండా ఎన్నో కష్టాలు ఇబ్బందులకు గురికావలసి వచ్చింది. ఆ సమయంలో ఆమెకు ఉన్న ఒకే ఒక ఆశ యూదా మూడవకుమారుడు షేలా. ఎందుకంటే ఆ ప్రాంత చట్ట ప్రకారం మరిది ధర్మం జరిగించవలసింది షేలా. వైవాహిక జీవితం ఎలా ఉన్నప్పటికి, అతని ద్వారా అయినా సంతానం కలిగితే తద్వారా వచ్చే స్వాస్థ్యముతో తన బిడ్డలను చూసుకుంటూ జీవించవచ్చు అనేది సాధారణమైన స్త్రీకి ఉండే నిరీక్షణ కాని ఆమెకు ఆ నిరీక్షణ కూడ లేకుండా

చేశాడు మామయైన యూదా.

యూదా తన కుమారులిద్దరు చనిపోవడానికి కారణం తామారు అనుకున్నాడు. అందుకే షేలా కూడా చనిపో తాడేమో అని షేలాను తామారుకు ఇచ్చి పెండ్లిచేయుటకు సమ్మతించక షేలా పెద్దవాడయ్యేంత వరకు వైధవ్యమును అనుభవిస్తూ విధవరాలిగా జీవించమని ఆమె పుట్టింటికి పంపించి వేశాడు. తామారు అందుకు సమ్మతించింది.

సొంతవారే మనల్ని దూరం పెట్టడం, శాపగ్రస్తురాలని తలంచడం అనేది వర్ణించలేని బాధ. తామారు అటువంటి స్థితి ద్వారా వెళ్ళింది. ఏమి చేయలేని, అయోమయ నిస్సహా స్థితిలో ఉన్నవారు ఎవరైనా ఖచ్చితంగా దేవునిని ఆశ్రయి స్తారు. తామారు కూడా తనకు సహాయం చేయగల దేవుని గురించి ఆలోచించి ఉంటది. ఆమె ఇశ్రాయేలు స్త్రీ అయితే దేవుని మీద పూర్తిగా ఆధారపడి ఆయన చిత్తము కొరకు నిరీక్షణ కలిగి మౌనంగా పుట్టింటికి వెళ్ళింది అనవచ్చు. తామారు కనానీయురాలైతే యూదా ఇంటిలో ఉన్నందున దేవుని గురించి కొంత తెలుసుకొని, తనకు సహాయం చేయగల, తన స్థితి మార్చగల నిజ దేవుని గురించి ఆలోచించి తన హృదయంలో దేవుని వెదకి ఉండొచ్చు.

*వివేకము కలిగి దేవుని వెదకువారు కలరేమో అని దేవుడు ఆకాశము నుండి చూచి నరులను పరిశీలించెను కీర్తన 53:2*

అయితే యూదాకు తన కుమారుడైన, షేలాకు తామారుతో వివాహం జరిపించాలనే ఆలోచన లేదు. పైపెచ్చు ఆమెను వేచి ఉండమని చెప్పి ఆమెతన జీవితానికి వేరే ఆధారం గురించి ఆలోచించనివ్వకుండా చేశాడు. తామారు వేచి ఉన్నది. కాలం గడుస్తున్నది. యూదా భార్య చనిపోయింది కాబట్టి మరికొంతం కాలం వేచి ఉంటుంది తామారు. అయితే పరిస్థితి మొత్తం సాధారణ స్థితికి వచ్చింది. ఇంకా చెప్పాలి అంటే విందు సమయం అనవచ్చు. గొర్రెల బొచ్చు కత్తిరించిన మీదట చిన్న విందు జరగడం ఆనవాయితీ. యూదా గొర్రెబొచ్చు కత్తిరించుటకు వెళ్తున్నాడు అంటే ఇంటి వద్ద ఉన్న ఆస్థిని పర్యవేక్షించునంత పెద్దవాడైనడు షేలా అని అర్థం.

ఈ విషయం తెలుసుకున్న తామారు తన మామ బుద్ధిని గ్రహించింది. కొన్ని ప్రాంతాలలో మరిది ధర్మం జరిగించుటకు చనిపోయిన వానికి సహోదరులు ఎవరూ లేని పక్షంలో ఆమె మామ ఆమెను వివాహమాడవచ్చును. బహుశా తామారుకు ఈ విషయం గురించిన అవగాహన ఉండి ఉంటుంది. అందుకే ధైర్యం చేసి వైధవ్య వస్త్రములు తీసివేసింది. తనను గుర్తించుటకు వీలు లేకుండా ముసుగు ధరించింది. ఆమె వస్త్రధారణ వేశ్యను తలపిస్తుంది. కాబట్టి యూదా ఆమెతో శయనించాడు.

సాధారణంగా ఎవరైనా గౌరవప్రదంగా జీవించాలి అనుకుంటారు. సరియైన ప్రవర్తన లేని వారు సైతం ఎదుటవారి ముందు మంచివారిగా కనబడాలని కోరుకుం టారు అటువంటిది తామారు వేశ్యను తలపించే వస్త్రాలను ధరించిందంటే ఆ సమయంలో ఆమె ఎంత మనో వేదనను అనుభవించకపోతే అటువంటి నిర్ణయం తీసుకొని ఉంటది?

కొన్ని గంటలు కళ్ళు మూసుకుంటే తను తీసుకున్న నిర్ణయం లేదా తన ఆలోచన నెరవేరుతుంది. అయితే తన ఆలోచన ఉనికిలోకి వచ్చినప్పుడు అంటే తాను గర్భవతినని తెలియవచ్చినప్పుడు తన మామయైన యూదా తనను అంగీకరించవచ్చు లేదా తృణీకరించవచ్చు కాబట్టి అతని సొంత వస్తువులైన ముద్ర దాని దారము, చేతికఱ్ఱ తీసుకున్నది.

తామారు గర్భవతి అని తెలుపబడినప్పుడు యూదా ఆవేశంతో ఆమెను కాల్చివేయాలి అన్నాడు కాని ఎప్పుడైతే ఆమె తన వద్దనున్న ముద్ర, దాని దారం చేతికర్ర పంపి ఆ వస్తువులు ఎవరివో ఆ వ్యక్తి వలన గర్భం దాల్చానని చెప్పడంతో యూదా తన తప్పును గ్రహించడమే కాక తన కంటే నీతిమంతురాలని గ్రహించి ఆమెతో మరెన్నడు తప్పుగా ప్రవర్తించక ఆమెను గౌరవించాడు.

*ఆయన దిక్కులేని దరిద్రుల ప్రార్థన నిరాకరింపక వారి ప్రార్థన వైపు తిరిగియున్నాడు. కీర్తనలు 102:17*

తామారు జీవితం లో ఎన్నో ఒడిదుడుకులు, భవిష్యత్తు అగమ్యగోచరం ఆమె హృదయ స్థితిని మాటల్లో అంచనా వేయడం కష్టం. అటువంటి దిక్కులేని స్థితిలో ఉన్న తామారును దేవుడు చూచాడు. ఆమె హృదయ వేదనను ఆయన నిర్లక్ష్యము చేయలేదు.

*విరిగిన హృదయము గలవారికి యెహోవా ఆసన్నుడు కీర్త 34:18*

తన ప్రమేయం లేకుండా తన జీవితంలో జరిగిన అన్నీ పరిస్థితులలో తను మౌనంగా భరించింది. తన జీవితంలో భర్త , మరిది, మామల వలన తన జీవితం ఎటూ కాని పరిస్థితిలో ఉన్నది. తన భవిష్యత్తుకు ఆధారమైన చివరి అవకాశముగా భావించి మామయైన యూదాతో సంతానం పొందాలనుకుంది తామారు. గర్భం దాల్చక పోయినా భర్తగా యూదా మీద హక్కునైన పొందుటకు ప్రయత్నించింది అనవచ్చు. ఈనాటి చట్టాలకు అది నేరముగా తోచినప్పటికి ఆనాటి దేశ కట్టడలు ప్రకారం సమాజంలో స్త్రీ మనుగడ నిమిత్తం ఏర్పరచబడిన చట్టాన్ని తామారు వాడుకుంది. నీతిమంతురాలైంది.

ఎంత విడ్డూరమో కదా! కొంత కాలం క్రితం ఈ తామారే తన బిడ్డల చావుకు కారణం అనుకున్నాడు యూదా. ఆమెను తమ జీవితాలలో నుండి దూరంగా పంపించి వేశాడు. కాని ఇప్పుడు ఆమె తన కంటే నీతిమంతురాలైంది. తన గోత్రానికి వారసురాలను ఇవ్వదగిన వ్యక్తిగా మారింది.

అంతేకాదు తామారును ఆశీర్వాద సూచకంగా పలకటం బహు విడ్డూరం. శాపగ్రస్తమైనదిగా మొదలైన ఆమె జీవితం నీతిమంతురాలు వలె మారటమే కాక భవిష్యత్తు తరాలకు ఆశీర్వాద సూచకంగాను (రూతు 4:12) సర్వప్రపంచ మానవాళి రక్షకుడైన యేసు వంశకర్తలలో ఒకరుగా స్థానం పొంది చరిత్రలో చెరగని ముద్రను వేసింది.

దేవుడు తనను ఆశ్రయించిన వారి జీవితాలను ఊహించని రీతిలో మార్చి, అత్యున్నతమైన స్థానంలో నిలబెడతాడు అనుటకు తామారు జీవితం ఒక ఉదాహరణ.

తామారువలె నీ జీవితం అగమ్యగోచరముగా ఉన్నదా? నీ సమస్య ఏదైనను,నీ పరిస్థితి ఏదైనను, నీవు ఎవరివైనను సరే, నీ జీవితాన్ని నీవు ఊహించని రీతిలో మార్చి నిన్ను ఆశీర్వాద సూచకంగా అత్యున్నత స్థానంలో నిలబెట్టుటకు సమర్ధుడైన నిజ దేవుడైన యేసును ఆశ్రయించి నీ స్థితిని మార్చుకో.

*యెహోవా తమకు దేవుడుగా గల జనులు ధన్యులు కీర్తనలు 33:12*

**పరిశుద్ధగ్రంథ పరిశోధనా పట్టిక-17 జవాబు**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 యే | 2 సు | 3 యో | 4 ఎ | లీ | 5 స | బె | తు | 6 బ |
| | వ | సే | | | త్రం | 7 మ | | ల |
| | ర్త | పు | 8 త్మ | ద్ధా | శు | రి | 9 ప | వం |
| 10 స | మా | ధా | 11 న | క | ర్త | య | శు | తు |
| | న | | జ | 12 నీ | | | వు | డై |
| 13 బే | ము | 14 దా | రే | తి | 15 జె | 16 క | ల | న |
| త్లె | | వీ | తు | చి | ర్యా | | పా | దే |
| 17 హే | రో | దు | | గు | 18 క | న్య | క | వు |
| ము | | 19 కై | స | రు | 20 ర | క్ష | కు | డు |

**పరిశుద్ధ గ్రంథ పరిశోధనా పట్టిక - 17**
**సరైన జవాబులు పంపించిన వారు**

1. డి. మెర్సీ ఇశ్రాయేల్, నెల్లూరు
2. కె. రూత్ ఇవాంజిలిన్, హైదరాబాద్
3. బి. ఆనీమేరి, హైదరాబాద్
4. టి. రాజకుమారి, విజయవాడ
5. కె. అనిత, రాజమండ్రి
6. బి. ఎస్తేరు, గుంటూరు
7. పి. శాంతాగ్రేస్, మచిలీపట్నం
8. బి. సువార్తరాజు, బెంగుళూరు

## గమనిక

క్రైస్తవ కథలు, వ్యాసాలు, రచనలు, కవితలు, పాటలు మొదలగునవి మా ప్రియ పాఠకుల నుండి కోరడమైనది. ఆసక్తి గలవారు తమ తమ భావాలను మా పత్రిక ద్వారా పాఠకులకు అందించవచ్చు. ఉత్తమ కథకు నగదు బహుమానం వుంటుంది. క్రైస్తవకథ ఏదైనా 2 పేజీలకు మించకూడదు.

**2024 Happy New Year**

చిన్నపిల్లల పేజి

# నిర్లక్ష్యము

తండ్రి లేని పిల్లవాడు, పైగా ఒక్కగానొక్క కొడుకు కావడంతో జాన్‌ని గారాభంగా పెంచింది తల్లి. జాన్ అడిగిందే తడువు ఏ వస్తువైన కొని ఇచ్చేది తల్లి. గారంభం వలన జాన్ మొండిగా తయారయ్యాడు. ఏ పనైనా తనకు నచ్చినట్లు చేసుకోపోయేవాడు. తనకు నచ్చింది చేసేవాడు. నిర్లక్ష్య వైఖరి అలవడింది. ఎవరేం చెప్పినా వినేవాడు కాదు.

జాన్ ఎక్కువ సమయం యూట్యూబ్ వీడియోలు చూడటం గమనించిన తల్లి, ఎక్కువగా సెల్‌ఫోన్ వాడితే కళ్ళు దెబ్బ తింటాయట అని హెచ్చరించింది. జాన్ తల్లి మాటలు లెక్క చేయకపోగా, అదేం కాదులే మా, అవన్నీ అబద్ధాలు. అలా అయితే కరోనా టైంలో పిల్లలకు సెల్‌ఫోన్స్ కొనివ్వమని ఎందుకు చెప్పినట్లు? ప్రొద్దున నుండి సాయంత్రం వరకు క్లాసెస్ నిమిత్తం ఫోన్ ఉపయేగిస్తే కళ్ళు దెబ్బ తినవా? అంటూ వితండవాదం చేశాడు. వాడితో మాటల్లో గెలవలేక మౌనం వహించింది తల్లి.

ఒకరోజు జాన్ సైకిల్ కావాలని పట్టుబట్టాడు. సైకిల్ కొనిచ్చింది తల్లి. సైకిల్‌ను చాలా వేగంగా, నిర్లక్ష్య ధోరణిలో తోలేవాడు జాన్. మెయిన్ రోడ్డు మీద కూడా అంతే స్పీడుగా త్రొక్కేవాడు. హ్యాండిల్‌ను పట్టుకోకుండా సైకిల్ తొక్కేవాడు. దారిలో కనిపించే తెలిసిన వారందరూ జాగ్రత్త, నిదానంగా వెళ్ళు అని చెప్పే విధంగా ఉండేది జాన్ సైకిల్ డ్రైవింగ్.

రోజు స్కూల్‌కి వెళ్ళేటప్పుడు జాగ్రత్త చెప్పే తల్లితో అందరిలా నెమ్మదిగా సైకిల్ నడపడంలో ఏముంది? స్పీడ్‌గా తొక్కితే కదా సైకిల్‌రైడంటే ఏంటో అర్థమయ్యేది, అయినా చివరి క్షణంలో కూడా సైకిల్‌ను బ్యాలెన్స్ చేయగలను మమ్మీ అనేవాడు. వాడు అన్నట్లే సైకిల్ కొన్నప్పట్నుండి ఒక్క చిన్న యాక్సిడెంట్ చేయలేదు, సైకిల్‌ను కూడా పడవేయలేదు.

జాన్ ఇలానే ఉంటే అతని భవిష్యత్తు ఏమౌతుందో అని భయపడి జాన్ మొండి వైఖరి మారాలని ప్రార్థించేది తల్లి.

జాన్ చదువుల్లో మంచిగా రాణించడంతో స్కూల్లో టీచర్లు వాడి మొండితనాన్ని పెద్దగా పట్టించుకునేవారు కాదు, పట్టించుకోవలసిన అవసరం రాలేదు అనడం కరెక్టేమో. స్కూల్లో పిల్లలు కూడా జాన్ వంటి మొండివాడితో మాటల్లో నెగ్గలేమని గ్రహించి, అతనితో అంటి ముట్టనట్టుగా ఉండేవారు. బెస్ట్‌ఫ్రెండ్స్ అంటూ జాన్‌కి ఎవరూ లేరు. ఎంతో చాకచక్యంగా వేగంగా సైకిల్ నడపడంలో అనుభవం ఉన్న జాన్‌ని తమ స్కూల్ తరుపున ఇంటర్‌స్టేట్ సైకిలింగ్ కాంపిటీషన్‌కు ఎంపిక చేసింది స్కూల్ యాజమాన్యం.

రేస్ నిమిత్తం కోచ్ చెప్పే సలహాలలో కూడా తనకు నచ్చేవి పాటించేవాడు. నచ్చనివి లైట్ తీసుకునేవాడు. కాని ప్రతి సారి మెరుగైన వేగంతో ప్రాక్టీస్ రేస్ ముగించడంతో జాన్ కోచ్ మాట వినాల్సిన అవసరం రాలేదు. కాంపిటీషన్ రోజు రానే వచ్చింది జాన్‌తో పాటు మరో పదిమంది ఆ రేస్‌లో పాల్గొన్నారు. అందరూ వేరు వేరు స్కూల్స్ నుండి ప్రాతినిధ్యం వహించారు. అందరూ ఎవరికి వారు తామే ముందు రావాలని ప్రయత్నించినప్పటికి కొన్ని సెకన్ల వ్యత్యాసంలో జాన్ ముందుగా గమ్యం చేరి విజేతగా నిలిచాడు.

పందెం గెలిచిన ఆనందం కంటే పందె మధ్యలో ఓడిపోతానేమో అని భయం వేసి, ప్రాక్టీస్‌టైంలో కోచ్ చెప్పిన చిన్న చిన్న ట్రిక్స్ ఫాలో అవ్వడం వలననే నెగ్గాను అన్న తలంపు జాన్‌కి అంతగా నచ్చలేదు. అయినా అందరి పొగడ్తల మధ్య ఆ తలంపు మాయమైంది. అమితుత్సాహంతో రెట్టింపు వేగంతో సైకిల్‌ను తొక్కుతూ ఇంటికి బయలు దేరాడు జాన్.

రోడ్డు మలుపు వచ్చినపుడు ఒక్క సెకను జాన్ కళ్ళు బైర్లు కమ్మినట్లు అనిపించడం, ఎదురుగా ఉన్న రాయిని గమనించకపోవడంతో ఎగిరి ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌కి గుద్దుకోవడం అన్ని సెకను కాలంలో జరిగిపోయాయి.

కళ్ళు తెరిచేసరికి ఆస్పత్రిలో కాలుకి కట్టుతో ఉన్నాడు జాన్. తృటిలో ప్రమాదం తప్పింది. మీ అబ్బాయి వచ్చే స్పీడుకి ట్రాక్టర్ చక్రాల క్రిందకు వెళ్ళిపోవలసింది. కుడి పాదానికి మోకాలికి ఉండే జాయింట్ దెబ్బతింది. సర్జరీ


చేసాము అన్న డాక్టర్ మాటలు విని ఎక్కి ఎక్కి ఏడుస్తున్న తల్లిన చూసి మొదటిసారి బాధ భయము కలిగాయి జాన్‌కి. తనను చూడడానికి వచ్చిన వారు జాన్ నిర్లక్ష్య ధోరణే ఈ స్థితికి కారణమన్నట్టు మాట్లాడటం విన్న జాన్, ఈ స్థితికి కారణమైన తన ప్రవర్తన గురించి ఆలోచించసాగాడు. రోజూ వెళ్ళే మార్గమే కాబట్టి తనకు ఆ దారిలో ప్రతి అంగుళం తెలుసు కళ్ళు మూసుకొని కూడా సైకిల్ తొక్కగలడు. అటువంటిది ఇంత పెద్ద యాక్సిడెంట్? తన శక్తి సామర్థ్యాల మీద ఉన్న నమ్మకం, గర్వం వీగిపోయాయి. ఎంత స్పీడ్‌నైనా మానేజ్ చేయగలను అనే తన ఆలోచన ఎంత తప్పో అర్థ మవ్వసాగింది. తన ప్రాణాన్ని కాపాడిన దేవునికి కృతజ్ఞత కలిగి ఉండమని చెప్పిన తల్లి మాటలు మొదటిసారి కరెక్ట్ అనిపించాయి జాన్‌కి. నెలరోజుల అనంతరం హాస్పిటల్ నుండి డిశ్చార్జ్ అయిన జాన్ ప్రవర్తనలో వచ్చిన మార్పును చూసిన తల్లి హృదయం దేవుని పట్ల కృతజ్ఞతతో నిండి పోయింది.

## బైబిల్ క్విజ్ – 01

### ఆదికాండము

1) దేవుడు సృష్టిని ప్రారంభించక ముందు భూమి ఎలా ఉంది? (ఆది. 1 అధ్యా.)
2) దేవుడు తోటను ఎక్కడ (ప్రదేశము) వేసెను? (ఆది. 2)
3) దేవుడైన యెహోవా చేసిన భూజంతువులలో యుక్తి గలది ఏది? (ఆది. 3)
4) భూమి మీద జన్మించిన మొదటి వ్యక్తి ఎవరు? (ఆది. 4)
5) భూమిమీద ఎక్కువకాలం జీవించిన వ్యక్తి ఎవరు? (ఆది. 5)
6) ఏ చెక్కతో నోవహు ఓడను నిర్మించెను? (ఆది. 6)
7) నోవహు యొక్క వయసు ఏ దినమందు వారు ఓడలో ప్రవేశించిరి? (ఆది. 7)
8) ఎంతకాలము నోవహు, ఆయన కుటుంబము ఓడలో నివసించిరి? (ఆది. 8)
9) నోవహుతో చేసిన నిబంధనకు గుర్తుగా దేవుడు మేఘములో ఏమి ఉంచెను? (ఆది. 9)
10) ఎవరి కాలములో భూమి దేశములుగా విభాగింప బడెను? (ఆది. 10)
11) బాబెలుగోపురం ఏదేశంలో నిర్మించబడినది? (ఆది. 11)
12) అబ్రాహాము కనాను దేశమునకు బయలుదేరినప్పుడు అయన వయస్సెంత? (ఆది. 12)
13) అబ్రాము లోతు ఎందుకు విడిపోయిరి? (ఆది. 13)
14) దశమభాగమును అబ్రాము ఎవరికిచ్చెను? (ఆది. 14)
15) అబ్రాము సంతానం ఎంతకాలం దాసులుగా ఉంటారని దేవుడు చెప్పాడు? (ఆది. 15)
16) హాగరు ఇష్మాయేలును కనినప్పుడు అబ్రాహాము వయస్సెంత? (ఆది. 16)
17) ఇష్మాయేలుకు సున్నతి చేసినప్పుడు అతని వయస్సెంత? (ఆది. 17)
18) "యెహోవాకు అసాధ్యమైనది ఏదైనానున్నదా?" రిఫరెన్సు ఏమిటి? (ఆది. 18)
19) కీడు తప్పించుకొనుటకు లోతు ఏ ఊరు వెళ్ళెను? (ఆది. 19)
20) అబీమెలెకు అబ్రాహాముకు ఎన్ని రూపాయలు ఇచ్చెను? (ఆది. 20)
21) అబీమెలెకు సేనాధిపతి ఎవరు? (ఆది. 21)
22) నాహోరు ఉపపత్ని ఎవరు? (ఆది. 22)
23) అబ్రాహాము భార్యయైన శారా ఎక్కడ (ప్రదేశము) పాతిపెట్టబడెను? (ఆది. 23)
24) బెతూయేలు తల్లి ఎవరు? (ఆది. 24 అధ్యా.)
25) శారా చనిపోయిన తర్వాత అబ్రాహాము ఎవరిని పెండ్లి చేసికొనెను? (ఆది. 25)

**'పరిశుద్ధగ్రంథ పరిశోధనా పట్టిక'** పజిల్ వచ్చే నెలతో ముగుస్తున్నందున, ఈ నెల నుండి బైబిల్ క్విజ్ ప్రచురిస్తున్నాం. ఆదికాండం నుండి ప్రకటన వరకు ప్రతి అధ్యాయం నుండి ఒక ప్రశ్న ఉంటుంది. మీరు ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొనటం ద్వారా బైబిలు జ్ఞానం సంపాదించా లన్నదే మాఉద్దేశ్యం. ప్రతిఒక్కరూ ఈ బైబిల్‌క్విజ్‌లో పాల్గొని బైబిలు జ్ఞానంతో పాటు బహుమతులు గెలు పొందవలసినదిగా కోరుచున్నాము. జవాబులు పేపరు మీద వ్రాసి, మీ పేరు, పత్రిక సీరియల్ నంబరు వేసి, వాట్సాప్ ద్వారా 9440217726 నంబరుకి పంపగలరు. పోస్ట్‌కార్డ్ ద్వారా అయితే, ఎడిటర్, హన్నాకృప, 6వలైను, క్లాపేట, ఒంగోలుకు పంపాలి.



# పరిశుద్ధ గ్రంథ పరిశోధనా పట్టిక - 18

**అడ్డం:**

6. బెన్హదదు ఈ దేశానికి రాజు (3) (2రాజులు)
9. ప్రిస్కిల్ల భర్త (3) (అపొ.కా)
11. ఏశావు జ్యేష్ఠత్వమును తృణీకరించుటకు కారణమైన కూరగాయ తారుమారైంది (3) (ఆది)
12. యెహోవా, సొలొమోనుకు విరోధిగా రేపిన ఎదోమీయుడు(3) (1రాజులు)
14. రిబ్కా సహోదరుడు (3) (ఆది)
16. ఎఫెసులోని కంసాలి (3) (అపొ.కా)
17. మోషే జయించిన ఐదుగురు మిద్యాను రాజులలో ఒకడు (2) (యెహోషువ)
18. తిరగబడిన యూదా కుమారుడు (3) (ఆది)
21. ప్రవక్తయైన యెహూ తండ్రి (3) (తారుమారు) (1రాజులు)
23. తారుమారైన యేసు శిష్యుడు, సుంకరి (3) (మత్తయి)
24. --- గా నుండుట గొప్ప భాగ్యము (3) (సామెతలు)
26. తారుమారైన హాము కుమారుడు (3) (ఆది)

**నిలువు:**

1. దావీదు దూతలు అబ్నేరును ఈ బావివద్ద నుండి తోడుకొని హెబ్రోను వచ్చిరి (2) (తలక్రిందులైంది) (2సమూయేలు)
2. తలక్రిందులైన ఓనాము కుమారుడు (2) (1దిన)
3. ఇహలోకమును స్నేహించి పౌలును విడి థెస్సలొనీకకు వెళ్ళినది ఎవరు? (2) (2తిమోతి)
4. తలక్రిందులైన కాలేబు కుమార్తె (2) (యెహోషువ)
5. బెన్యామీను కుమారుడు (2) (ఆది)
7. తలక్రిందులైన ఏథెన్సు స్త్రీ (3) (అపొ.కా)
8. మూడవ దూత బూర ఊదినప్పుడు రాలిన నక్షత్రం పేరు (4) (ప్రకటన)
10. శీర్షాసనమేసిన సిప్పోరు కుమారుడు(3) (సంఖ్యా)
12. దిషోను కుమారుడు (3) (1దిన)
13. యూదారాజైన ఆసాను ధైర్యపరచిన ప్రవక్త, అజర్యా తండ్రి శీర్షాసనమేశాడు(3)(2దిన)
14. పీషోను నది పారుచున్న దేశం తలక్రిందులైంది (3) (ఆది)
15. రాజైన దావీదు కాలం నాటి ప్రవక్త తలక్రిందులైనాడు (3) (2సమూ)
19. మిల్కా భర్త (3) (ఆది)
20. ఇశ్రాయేలీయుల కనాను ప్రయాణం ప్రారంభమైన ప్రాంతం (4) (నిర్గమ)
22. యూదుల ప్రథమ మాసము (3) (ఎస్తేరు)
24. నీ వెలుగు వేకువ --- వలె ఉదయించును. (2) (యెషయా)
25. చచ్చిన సింహము కంటే బ్రదికియున్న --- మేలు గదా (2) (ప్రసంగి)
26. ఆకాను తండ్రి (2) (యెహోషువ)
27. ఉష్ణధారలు కనుగొనినవాడు (2) (తలక్రిందులుగా) (ఆది)